**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం



PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక

RNI : TELTEL/2021/80267

సంపుటి: 6 సంచిక: 116, పేజీలు - 08

మంగళవారం,అక్టోబర్ 27, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







## తుమ్మిడిహెట్టిపై తెలంగాణ ప్రతిపాదనకు

# ఫడ్నవీస్ సానుకూలం!

- 152 మీటర్లకు పెంచాలని తెలంగాణ ప్రతిపాదన
- అధ్యయనానికి అధికారుల కమిటీ ప్రతిపాదన
- రెండు లక్షల ఎకరాలకు సాగునీరు లక్ష్యం
- ముంపు భూములకు పరిహారం చెల్లిస్తామని హామీ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతుల సాగునీటి కల నెరవేరే దిశగా కీలక ముందడుగు పడింది. ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 152 మీటర్లకు పెంచాలన్న తెలంగాణ ప్రతిపాదనపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. ఎత్తు పెంపుతో మహారాష్ట్రకు ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండకూడదని స్పష్టం చేస్తూనే తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకు అభ్యంతరం లేదని వెల్లడించారు. బ్యారేజీ ఎత్తు పెంపుపై తుది నిర్ణయం తీసుకునే ముందు అన్ని అంశాలపై సమగ్ర అధ్యయనం చేయాల్సి ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

### రెండు రాష్ట్రాలు కలిసికట్టుగా ముందుకు వెళ్లాలి

తెలంగాణ – మహారాష్ట్ర మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. పూర్వ హైదరాబాద్ సంస్థానంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలకు ఉన్న చారిత్రక అనుబంధాన్ని ప్రస్తావించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధానంగా వెనుకబడిన అటవీ ప్రాంతమని తెలిపారు.'అక్కడి గిరిజనులు, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను మహారాష్ట్ర సీఎం దేవేందర్ ఫడ్నవీస్ దృష్టికి తీసుకెళ్లారు. కొమురం భీమ్ సాగించిన జల్, జంగిల్, జమీన్ పోరాటాన్ని గుర్తుచేశారు. ఆ పోరాట కాలం నుంచి ఆదిలాబాద్ ప్రాంత ప్రజలు సాగు, తాగునీటి సదుపాయాల కోసం ఎదురుచూస్తున్నారని సీఎం తెలిపారు. దశాబ్దాలుగా వారి ఆకాంక్షలు నెరవేరలేదని, ఆదిలాబాద్ గిరిజనులు, ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన అవసరం ఉందన్నారు. వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు రెండు రాష్ట్రాలు కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

### తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సహకరించాలి

దేశ రక్షణ, జాతీయ వ్యూహాత్మక ప్రయోజనాల పరంగా ఆదిలాబాద్ ప్రాంతానికి ఉన్న ప్రాధాన్యతను రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత రక్షణ, పౌర విమానాశ్రయ సదుపాయం అందుబాటులోకి వస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ఊతమిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మహారాష్ట్రలోని సరిహద్దు ప్రాంతాలకూ ప్రయోజనం కలుగుతుందని వివరించారు.విమానాశ్రయంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో రవాణా సదుపాయాలతో పాటు ఆర్థిక కార్యకలాపాలు, అభివృద్ధి అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదన్నారు. రెండు రాష్ట్రాలను భౌతికంగా అనుసంధానించే వారధిగా కూడా నిలుస్తుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, గిరిజనుల సంక్షేమానికి రెండు రాష్ట్రాల సహకారం అవసరమన్నారు. పరస్పర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సహకరించాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కి విజ్ఞప్తి చేశారు.

### సానుకూలంగా స్పందించిన మహారాష్ట్ర సీఎం

తెలంగాణ ప్రతిపాదనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. తెలంగాణతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని గుర్తుచేశారు. సరిహద్దులోని ఆదిలాబాద్ ప్రాంతంతో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. తన అమ్మమ్మ తెలుగు మాట్లాడతారని ఈ సందర్భంగా ప్రస్తావించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును పెంచాలన్న తెలంగాణ అభ్యర్థనను మరోసారి పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

2లో..

## క్రిమినల్స్ నడిపే పార్టీ బీజేపీ

**- రాహుల్ కేసులో కోర్టు తీర్పును స్వాగతించిన కాంగ్రెస్**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పరువు నష్టం కేసులో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఊరట లభించడంతో బీజేపీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది కాంగ్రెస్. బీజేపీని నేరస్థులు నడిపే పార్టీగా అభివర్ణించింది. గాంధేయ మార్గంలో పోరాడి, ప్రేమ, కరుణ, పట్టుదలతో బీజేపీని ఓడిస్తామని పేర్కొంది. బీజేపీ నేత అమిత్ షాపై 2018లో చేసిన వ్యాఖ్యలకు సంబంధించి ఆయనపై నమోదైన పరువు నష్టం కేసులో ఉత్తర్ప్రదేశ్‌లోని సుల్తాన్‌పుర్ ప్రత్యేక ఎంపీ, ఎమ్మెల్యే కోర్టు నిర్దోషిగా సోమవారం ఉదయం ప్రకటించగా, ఆ తీర్పును కాంగ్రెస్ స్వాగతించింది.

2లో..

## ఎన్నికల కమిషనర్ల

# నిర్ణయాలన్నీ ఏకగ్రీవమే

**- ఫారం-6లో మార్పులు చేయలేదు - సర్ పై సుప్రీంలో ఈసీ అఫిడవిట్**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై దేశవ్యాప్తంగా కొనసాగుతున్న వివాదానికి సంబంధించి భారత ఎన్నికల సంఘం సుప్రీంకోర్టులో కీలక అఫిడవిట్ దాఖలు చేసింది. ఎస్ఐఆర్ అమలుపై ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలు ఉన్నాయంటూ వచ్చిన వార్తల నేపథ్యంలో.. తమ నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నట్లు తేల్చి చెప్పింది. ఈ అంశంపై సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లు కేవలం వార్తాపత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగానే ఉన్నాయని పేర్కొంటూ వాటిని కొట్టివేయాలని కోరింది. నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో ప్రధాన

2లో..

## హేట్ స్పీచ్ బిల్లును

# ఉపసంహరించుకోండి

**- కాంగ్రెస్ కు బీఆర్ఎస్ డిమాండ్**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన హేట్ స్పీచ్ బిల్లును ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. బిల్లులోని పలు నిబంధనలు రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛ, పత్రికా స్వేచ్ఛ, రాజకీయ విమర్శలకు విఘాతం కలిగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు శాసనసభ సెలక్ట్ కమిటీ ఛైర్మన్కు బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సోమ భరత్ కుమార్ సవివరమైన మెమోరాండం సమర్పించారు.

### స్పష్టమైన నిర్వచనాలు లేవు

హేట్ స్పీచ్, హేట్ క్రైమ్స్‌ను నిరోధించడంలో తమ పార్టీకి అభ్యంతరం లేదని స్పష్టం చేసిన బీఆర్ఎస్ హింసకు ప్రేరేపించే ప్రసంగాలు, వ్యక్తులపై దాడులను అరికట్టేందుకు చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందేనని పేర్కొంది. అయితే, బిల్లులోని నిర్వచనాలు విస్తృతంగా ఉండటం, నేర నిర్ధారణకు స్పష్టమైన ప్రమాణాలు లేకపోవడం, అధికారులకు విస్తృత అధికారాలు కల్పించడం వల్ల చట్టం దుర్వినియోగమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. బిల్లులోని 'హేట్ స్పీచ్', 'శత్రుత్వం', 'ద్వేషం', 'అసౌకర్యం కలిగించే వ్యాఖ్యలు' వంటి పదాలకు స్పష్టమైన నిర్వచనాలు

2లో..

## హైదరాబాద్ ఐటీ కారిడార్‌కు కొత్త రూపు

**- రహదారుల వెంట ప్రపంచస్థాయి ఫుట్‌పాత్‌లు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరిచేందుకు కొత్తగా ఏర్పాటైన సైబరాబాద్ నగరపాలక సంస్థ (సీఎంసీ) ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, హైటెక్ సిటీ ప్రాంతాల్లో ఉన్న తరహాలో ప్రధాన రహదారుల పక్కన ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఫుట్‌పాత్‌లను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ముందుగా రహదారుల విస్తరణ పనులను

2లో..

## సైక్లోన్‌పై ప్రతీ 4 గంటలకు

# హెచ్చరికలు జారీ చేయాలి

- యానాం వద్ద ఈ నెల 28న తీరం దాటనున్న తుపాను
- కోస్తాంధ్రలోని 11 జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలకు అవకాశం
- ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టిన ప్రభుత్వం
- లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు

**అమరావతి (ప్రశ్న న్యూస్)** బంగాళాఖాతంలో ఏర్పడిన ఆర్నబ్ తుఫాన్ నేపథ్యంలో రాష్ట్ర యంత్రాంగం అప్రమత్తం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. క్యాంపు కార్యాలయం నుంచి ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో సీఎం వర్చువల్‌గా సమీక్షించారు. రేపటి కల్లా తీవ్ర తుఫానుగా మారి ఇది రాష్ట్రంపై ప్రభావం చూపే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం హెచ్చరికల రీత్యా ఆయా తీరప్రాంత జిల్లాల కలెక్టర్లు ముందస్తు చర్యలు చేపట్టాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ నెల 28వ తేదీన ఆర్నబ్ తీవ్ర తుఫాను బాపట్ల-విశాఖ మధ్య యానాం వద్ద తీరాన్ని దాటే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. తుఫాను కారణంగా నేడు మధ్యాహ్నం నుంచి శ్రీకాకుళం నుంచి నెల్లూరు జిల్లా వరకూ వివిధ జిల్లాల్లో



2లో..

## మెట్రో సెకండ్ ఫేజ్..

# కీలక అడుగు

- రూ.24,269 కోట్లతో మెట్రో విస్తరణ
- గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన కేంద్రం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ నగర ప్రజా రవాణా వ్యవస్థను మరింత విస్తరించే దిశగా మెట్రో రైల్ ఫేజ్-2 ప్రతిపాదనలు కీలక దశకు చేరుకున్నాయి. రూ.24,269 కోట్ల అంచనా వ్యయంతో 76 కిలోమీటర్ల మేర ఐదు కొత్త మెట్రో కారిడార్లను అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

2లో..

## చెల్లి, మేనకోడలి విషయంలో

# జగన్ భిన్నంగా వ్యవహరిస్తున్నారు

- మేనకోడలి పెళ్లికి మేనమామగా దీవించాల్సింది పోయి అడ్డుకుంటున్నారని ఆరోపణ
- సొంత కుటుంబం పట్లనే అలా ఉంటే, రాష్ట్ర మహిళలను ఏం చూసుకుంటారని వ్యాఖ్య
- మంగళగిరి నియోజకవర్గంలో టీడీపీలోకి పలువురు వైసీపీ, సీపీఎం నేతల చేరిక



**అమరావతి (ప్రశ్న న్యూస్)** వైసీపీ అధినేత జగన్ పై ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సొంత కుటుంబ సభ్యుల విషయంలోనే జగన్ వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉందని ట్వీట్ చేశారు. ప్రతి కుటుంబంలో మేనకోడలి పెళ్లికి మేనమామ అన్నీతానై ఆశీర్వదించి పంపుతాడని, కానీ జగన్ మాత్రం అందుకు భిన్నంగా ప్రవర్తిస్తున్నారని లోకేశ్ తెలిపారు. దివంగత వైఎస్సార్ సొంత ఇంట్లో ఆయన మనవరాలి పెళ్లి జరగకుండా జగన్ అడ్డుకుంటున్నారని లోకేశ్ ఆరోపించారు. "సొంత చెల్లెలి విషయంలోనే ఇలా ప్రవర్తిస్తే, గత ఐదేళ్లలో రాష్ట్రంలోని మహిళలను, సోదరీమణులను ఆయన ఎలా చూసుకున్నారో ప్రజలకు ఇప్పటికే అర్థమైంది" అని లోకేశ్ వ్యాఖ్యానించారు. సొంత కుటుంబానికే న్యాయం చేయలేని వ్యక్తి, రాష్ట్ర ప్రజలకు ఏం చేస్తారని ఆయన ప్రశ్నించారు.

2లో..

## ఇందిరమ్మ ఇళ్ల పెండింగ్ బిల్లులు

# త్వరలో జమ

- లబ్ధిదారులు ఆందోళన చెందవద్దన్న మంత్రి పొంగులేటి - రూ.40 వేల కోట్లతో 8 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యం
- తరువాతి విడతల్లోనూ అర్హులకు ఇళ్ల కేటాయింపు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసినప్పటికీ తుది బిల్లుల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు తెలంగాణ ప్రభుత్వం ఊరటనిచ్చే ప్రకటన చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫైనల్ బిల్లులను రాబోయే కొద్ది రోజుల్లో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇళ్లు పూర్తయినప్పటికీ తుది బిల్లు అందలేదని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లిలో పర్యటించిన



2లో..

## తుమ్మిడిహెట్టిపై తెలంగాణ ప్రతిపాదనకు

# ఫడ్నవీస్ సానుకూలం!

అయితే తుది నిర్ణయానికి వచ్చే ముందు పలు అంశాలపై అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక, పర్యావరణ, పరిపాలనాపరమైన అంశాలను పరిశీలించాలని స్పష్టం చేశారు.

### తెలంగాణ నీటి అవసరాలకు సహకరిస్తాం

మహారాష్ట్రకు, తమ ప్రజలకు ఎలాంటి ప్రతికూల ప్రభావం లేకపోతే 148 మీటర్ల ఎత్తు ఒప్పందాన్ని పున: పరిశీలించేందుకు అభ్యంతరం లేదని సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ అన్నారు. తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఫడ్నవీస్ స్పష్టం చేశారు. జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. స్నేహభావం, సోదరభావంతో మంచి పొరుగు రాష్ట్రాలుగా ముందుకు వెళ్లాలని అభిప్రాయపడ్డారు. గతంలో ఇతర రాష్ట్రాలతో మహారాష్ట్ర పలు అంతర్రాష్ట్ర సమస్యలను పరిష్కరించుకుందని గుర్తుచేశారు. పరస్పర చర్చలు, సహకారంతో ఆయా సమస్యలకు పరిష్కారం కనుగొన్నామని సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ వివరించారు.

### ప్రత్యామ్నాయాలపై కూడా అధ్యయనం అవసరం

'తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు విషయంలో కేంద్ర జల సంఘం (చసీడబ్ల్యూసీ) తన పరిధిలో అవసరమైన అధ్యయనాలు చేపడుతుందని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ తెలిపారు. సాంకేతిక పరిశీలనలు కొనసాగిస్తుందన్నారు. ఈలోపు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ఫడ్నవీస్ గారు ప్రతిపాదించారు. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యతపై కమిటీ సమగ్రంగా అధ్యయనం చేయాలని సూచించారు. మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములు, ప్రభావిత ప్రాంతాలను పరిశీలించాలన్నారు. పరిహారం, ఇతర సాంకేతిక అంశాలను కూడా అధ్యయనం చేయాలని చెప్పారు. ముంపు ప్రభావం, ప్రభావిత భూముల విస్తీర్ణంపై రెండు రాష్ట్రాల అంచనాలను పరిశీలించాలని సూచించారు. ఇరు రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అవసరమైతే ప్రత్యామ్నాయాలను కూడా అధ్యయనం చేయాలని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ అన్నారు.'రెండు రాష్ట్రాల అధికారులు, సాంకేతిక నిపుణులు సంప్రదింపులు జరపాలని సూచించారు. తదుపరి సమావేశాల నిర్వహణ, కాలపరిమితులను నిర్ణయించాలన్నారు. ప్రాజెక్టుపై ముందుకు వెళ్లేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. దేశంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఇరువురు ముఖ్యమంత్రులు పునరుద్ఘాటించారు. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. గిరిజనులు, ఆదివాసీలు, అభివృద్ధి అవకాశాలు అందని వర్గాల సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి కృషి చేయాలి'అని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ నొక్కి చెప్పారు.

### ప్రాజెక్టుపై మంత్రి ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్

తెలంగాణకు అత్యంత కీలకమైన తుమ్మిడిహెట్టి బ్యారేజీకి సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో సమావేశమయ్యారు. ముంబైలోని సహ్యాద్రి ప్రభుత్వ అతిథి గృహంలో జరిగిన ఈ భేటీలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఇరు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.తెలంగాణ – మహారాష్ట్ర సరిహద్దుల్లో ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజ్ నిర్మాణంపై ఈ సమావేశంలో కీలకమైన చర్చలు జరిగాయి. బ్యారేజీ ఎత్తు పెంపు, నీటి లభ్యత, ముంపు ప్రభావం, ఇతర సాంకేతిక అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సమావేశం ప్రారంభంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజెంటేషన్ ద్వారా తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, సంస్కృతి, గిరిజనుల జీవన పరిస్థితులు, ఆర్థిక వెనుకబాటుతనాన్ని మహారాష్ట్ర ప్రతినిధి బృందం దృష్టికి తీసుకెళ్లారు. సుసంపన్నమైన చరిత్ర, సాంస్కృతిక వారసత్వం ఉన్నప్పటికీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిలో వెనుకబడిపోయిందని తెలిపారు. గిరిజనులు, ఆదివాసీలకు అభివృద్ధి ఫలాలు అందలేదన్నారు. ఆర్థిక అవకాశాలు లేకపోవడం, వెనుకబాటుతనం కారణంగా గతంలో నక్సలిజం వంటి సమస్యలు తలెత్తిన పరిస్థితులను వివరించారు. ఆ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు 1975 అక్టోబర్ 6న అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు, ఎస్ బీ చవాన్‌ల మధ్య కుదిరిన ఒప్పందం నుంచి వివిధ దశల్లో జరుగుతున్న ప్రయత్నాలను తెలిపారు. 5 దశాబ్దాలుగా అనేక ప్రతిపాదనలు, చర్చలు జరిగాయని గుర్తుచేశారు. అయినప్పటికీ ఆశించిన పురోగతి సాధించలేకపోయామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

### తుమ్మిడిహెట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో నిర్మించడమే ప్రయోజనం

2016లో తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 148 మీటర్లుగా నిర్ణయిస్తూ ఒప్పందం కుదిరిందని గుర్తుచేశారు. అయితే ఈ ఎత్తుతో బ్యారేజీ నిర్మిస్తే తెలంగాణ ప్రాంత తాగు, సాగునీటి అవసరాలు పూర్తిస్థాయిలో తీరవని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ప్రస్తుత విద్యుత్ అవసరాలు, ఇంధన వ్యయం, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ప్రాజెక్టు నిర్వహణ వ్యయం కూడా ముఖ్యమైన అంశమన్నారు. అందుకే గ్రావిటీ ద్వారా నీటిని తరలించే అవకాశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ పరిస్థితుల్లో తుమ్మిడిహెట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో నిర్మించడమే అత్యంత ప్రయోజనకరమైన ప్రత్యామ్నాయమని వివరించారు. సాంకేతిక, నిర్వహణ, ఆర్థిక అంశాల పరంగా ఈ ప్రతిపాదనకు ఉన్న ప్రాధాన్యాన్ని మంత్రి తన ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణంతో మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. మహారాష్ట్రలో అమల్లో ఉన్న భూసేకరణ నిబంధనలు, ఆ రాష్ట్ర పరిహార విధానం ప్రకారం రైతులకు పరిహారం చెల్లిస్తామని తెలిపారు.

## హైదరాబాద్ ఐటీ కారిడార్‌కు కొత్త రూపు

పూర్తి చేసి ఆ తర్వాత రోడ్లకు ఇరువైపులా పాదచారులకు అనువైన కాలిబాటలను నిర్మించనున్నారు. ఈ మేరకు సీఎంసీ కమిషనర్ డాక్టర్ సృజన ప్రత్యేక దృష్టి సారించారు. ఇందుకోసం ఇప్పటికే పలు రహదారులను గుర్తించగా వాటి అభివృద్ధికి అవసరమైన డిజైన్లను ఇంజినీరింగ్ విభాగం రూపొందిస్తోంది. సీఎంసీ పరిధిలో ప్రస్తుతం హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టు కింద సుమారు రూ.2 వేల కోట్ల విలువైన పనులు కొనసాగుతున్నాయి. వీటికి అదనంగా ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను చేపట్టేందుకు బ్యాంకుల నుంచి రుణాలు సమీకరించాలని నగరపాలక సంస్థ యోచిస్తోంది. ఈ క్రమంలో ఆసియా అభివృద్ధి బ్యాంకు ప్రతినిధులు కూడా రుణాల ప్రతిపాదనలు సమర్పించాలని కోరడంతో ఆ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు భావిస్తున్నారు. ప్రాధాన్య ప్రాజెక్టులను గుర్తించి వాటికి సంబంధించిన ప్రతిపాదనలు, సాంకేతిక నమూనాలను సిద్ధం చేస్తున్నారు. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే రహదారులకు ఈ ప్రణాళికలో ప్రాధాన్యం ఇవ్వనున్నారు. సీఎంసీ పరిధిలోని మెట్రో కారిడార్ వెంట ఉన్న రహదారులతోపాటు, ప్రస్తుతం విస్తరణ పనులు జరుగుతున్న మార్గాలను కూడా అభివృద్ధి జాబితాలో చేర్చినట్లు సమాచారం. ఫుట్‌పాత్‌ల నిర్మాణంతో పాటు కూడళ్ల వద్ద పాదచారులు సురక్షితంగా రహదారులను దాటేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. ఇందులో భాగంగా లేన్ మార్కింగ్, జీబ్రా క్రాసింగ్‌లు, ఫుట్‌పాత్ ర్యాంపులను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు. ఈ సదుపాయాలు అమలైతే నడిచే వారికి మరింత సౌకర్యం కలగడంతోపాటు రహదారుల వినియోగంలో క్రమబద్ధత పెరిగే అవకాశం ఉంది.ఫుట్‌పాత్‌ల అభివృద్ధితోపాటు నగర పరిధిలో పచ్చదనాన్ని పెంచడం, వరద నీటి నిర్వహణను మెరుగుపరచడంపైనా సీఎంసీ దృష్టి సారించింది. సంస్థ పరిధిలో ప్రహరీ గోడలు ఉన్నప్పటికీ ప్రస్తుతం ఖాళీగా ఉన్న సుమారు 350 స్థలాలను పార్కులుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఈ స్థలాలకు సంబంధించిన డిజైన్లను త్వరలో పూర్తి చేసి నిధుల కోసం ఏడీబీకి ప్రతిపాదనలు సమర్పించేందుకు కసరత్తు చేస్తోంది. అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాలను ప్రజలకు ఉపయోగపడేలా మార్చడం ద్వారా నివాస ప్రాంతాల్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు, జాతీయ రహదారులకు ఇరువైపులా వరద నీరు సక్రమంగా వెళ్లేందుకు అవసరమైన వ్యవస్థను అభివృద్ధి చేయడంతోపాటు, నాలాల పునరుద్ధరణకు కూడా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. వర్షాకాలంలో నీరు నిలిచిపోయే సమస్యలను తగ్గించేందుకు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం కీలకంగా మారింది. ఫుట్‌పాత్‌లు, పార్కులు, వరద నీటి కాలువల అభివృద్ధికి నిధులు సమకూరడం, ప్రతిపాదిత పనులు కార్యరూపం దాల్చడం ద్వారా సైబరాబాద్ ప్రాంతంలో పాదచారుల భద్రత, పర్యావరణ పరిరక్షణ, పట్టణ మౌలిక సదుపాయాలు మెరుగుపడే అవకాశం ఉంది.

## చెల్లి, మేనకోడలి విషయంలో జగన్ భిన్నంగా వ్యవహరిస్తున్నారు

మరోవైపు, ఉండవల్లిలోని తన నివాసంలో పలువురు నేతలను నారా లోకేశ్ టీడీపీలోకి ఆహ్వానించారు. మంగళగిరి నియోజకవర్గానికి చెందిన సీపీఎం నేతలు శివన్నారాయణ (కొలనుకొండ), ముసలి జ్యోతిబసు (ఆత్మకూరు)లతో పాటు వైసీపీ నేతలు నూతలపాటి చెన్నకేశవరావు (పేరుకలపూడి), ఉయ్యూరు వెంకటేశ్వరరావు (ఈమని), ముద్రబోయిన శ్రీను, షేక్ యూసబ్ (చిలువూరు) టీడీపీలో చేరారు. వీరందరికీ లోకేశ్ పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానం పలికారు. వీరితో పాటు పెద్ద సంఖ్యలో వైసీపీ, సీపీఎం కార్యకర్తలు కూడా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

## క్రిమినల్స్ నడిపే పార్టీ బీజేపీ

నిజం గెలిచిందని పేర్కొంది. బీజేపీ అధికారంలోకి రావడానికి నేరాలకు పాల్పడిన వారిని ప్రోత్సహిస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆరోపించారు. ఆ పార్టీని ఓడించేందుకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అయితే ఆ పోరాటం హింసకు తావులేకుండా మహాత్మా గాంధీ చూపిన మార్గంలోనే సాగుతుందని చెప్పారు. ప్రేమ, కరుణ, పట్టుదలతో బీజేపీని ఎదుర్కొంటామని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ 2018లో చేసిన వ్యాఖ్యల్లో పరువు నష్టం కలిగించే అంశం లేదని కోర్టు స్పష్టం చేసిందని కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు.అమిత్ షాను వ్యక్తిగతంగా కించపరచాలనే ఉద్దేశంతో ఆ వ్యాఖ్యలు చేయలేదని రాహుల్ తరఫున హాజరైన న్యాయవాది వాదించారు. "ఈ కేసులో రాహుల్ గాంధీ నిర్దోషిగా విడుదలయ్యారు. ఫిర్యాదుదారునికి దావా వేసేందుకు చట్టపరమైన అర్హత లేదని కోర్టు నిర్ధారించింది. రాహుల్ గాంధీ నిర్దోషిగా తేలడం పట్ల ప్రస్తుతం మా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నాం. తీర్పు ఉత్తర్వులను పూర్తిగా పరిశీలించలేదు. ఈ కేసును కొట్టివేయడానికి గల నిర్దిష్ట కారణాలు లేదా ప్రాతిపదిక ఏమిటో, పూర్తి తీర్పు ప్రతిని చూసిన తర్వాతే చెప్పగలము" అని రాహుల్ తరఫు న్యాయవాది కాశీ ప్రసాద్ శుక్లా అన్నారు. తాజాగా ఆ కేసులో విచారణ పూర్తి చేసిన సుల్తాన్‌పూర్ ప్రత్యేక కోర్టు రాహుల్ గాంధీని నిర్దోషిగా ప్రకటించింది. అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ శుభమ్ వర్మ తీర్పు వెలువరించారు. కోర్టు నిర్ణయంతో ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్న ఆ కేసుకు ముగింపు లభించింది. తీర్పు వెలువడిన సమయంలో రాహుల్ గాంధీ కోర్టులోనే ఉన్నారు. అనంతరం ఆయన బయటకు రాగానే కాంగ్రెస్ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. డప్పులు కొడుతూ, మిఠాయిలు పంచుతూ ఆనందం వ్యక్తం చేశారు. 'సత్యమేవ జయతే' అంటూ నినాదాలు చేశారు.కోర్టు తీర్పు తమ వాదనకు బలం చేకూర్చిందని కాంగ్రెస్ భావిస్తోంది. అదే సమయంలో బీజేపీపై రాజకీయ విమర్శలను మరింత గట్టిగా వినిపించింది. 2018లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ వివాదం మొదలైంది. ఆ సమయంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న అమిత్ షాపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. బెంగళూరులో జరిగిన మీడియా సమావేశంలో రాహుల్ మాట్లాడుతూ, హత్య కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి బీజేపీ అధ్యక్షుడిగా ఉన్నారని వ్యాఖ్యానించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలు అమిత్ షా ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్నాయని ఆరోపిస్తూ సుల్తాన్‌పూర్‌కు చెందిన బీజేపీ నేత విజయ్ మిశ్రా కోర్టును ఆశ్రయించారు. 2018 ఆగస్టు 4న విజయ్ మిశ్రా పరువు నష్టం ఫిర్యాదు దాఖలు చేశారు. ఆ కేసులో రాహుల్ గాంధీ 2023లో కోర్టుకు హాజరై బెయిల్ పొందారు. అనంతరం కేసు విచారణ కొనసాగింది. రాహుల్ చేసిన వ్యాఖ్యలను ఫిర్యాదుదారుడు తప్పుబట్టగా, వాటిని సందర్భం నుంచి విడదీసి చూస్తున్నారని కాంగ్రెస్ నేత తరఫు న్యాయవాదులు వాదించారు.

## ఎన్నికల కమిషనర్ల నిర్ణయాలన్నీ ఏకగ్రీవమే

ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఇతర ఎన్నికల కమిషనర్ల అభిప్రాయాలు, సూచనలు, సందేహాలను పరిగణనలోకి తీసుకుంటామని వివరించింది. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి 2025 జూన్, అక్టోబర్ 2026 మే నెలల్లో జారీ చేసిన 3 కీలక ఉత్తర్వులు కూడా ముగ్గురు ఎన్నికల కమిషనర్లు ఏకగ్రీవంగానే ఆమోదం తెలిపారని ఎన్నికల సంఘం తన అఫిడవిట్‌లో పేర్కొంది. నిర్ణయాల రూపకల్పనలో అధికారులు చేసే సూచనలు, అభ్యంతరాలు, ప్రశ్నలు, భిన్నాభిప్రాయాలను పరిశీలిస్తామని తెలిపింది. ఒక ఫైల్ పరిశీలన సమయంలో ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర కమిషనర్లు ఏదైనా ప్రశ్న అడిగినా, సూచన చేసినా, దాన్ని ఎన్నికల సంఘం తుది నిర్ణయంగా పరిగణించలేమని వివరించింది. నిర్ణయ ప్రక్రియలో అభిప్రాయాలను వ్యక్తం చేయడం ఒక భాగమని అధికారికంగా ఆమోదం పొందిన నిర్ణయమే ఎన్నికల సంఘం నిర్ణయంగా పరిగణనలోకి వస్తుందని స్పష్టం చేసింది.ఎన్నికల సంఘం వివరాల ప్రకారం సంబంధిత విభాగాలు సిద్ధం చేసిన ఫైళ్లను తొలుత ఒక ఎన్నికల కమిషనర్‌కు, ఆ తర్వాత మరో కమిషనర్‌కు, చివరగా ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు పంపిస్తారు. పరిశీలన, ఆమోదం అనంతరం తీసుకున్న నిర్ణయాలను సంబంధిత ఫైళ్లలో నమోదు చేస్తారు. వాటిపై ఎన్నికల కమిషనర్లు, ప్రధాన ఎన్నికల కమిషనర్ సంతకాలు ఉంటాయని అఫిడవిట్‌లో ఎన్నికల సంఘం వివరించింది. అనంతరం ఎన్నికల సంఘం కార్యదర్శిత్వం ద్వారా ఆ నిర్ణయాలను అధికారికంగా ప్రకటించి అమలు చేస్తారని పేర్కొంది.2023 చట్టంలోని సెక్షన్ 18 ప్రకారం ఫైల్ పరిశీలన సమయంలో వ్యక్తం చేసే సూచనలు, ప్రశ్నలు మాత్రమే ఎన్నికల సంఘం తుది నిర్ణయంగా పరిగణించబడవని స్పష్టం చేసింది. ఈ వివరణ ద్వారా నిర్ణయాలపై అంతర్గత చర్చలు జరగడం, తుది నిర్ణయం అధికారికంగా ఆమోదం పొందడం రెండూ వేర్వేరు ప్రక్రియలని ఎన్నికల సంఘం వాదించింది. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫారం–6లో మార్పులు చేశారన్న ఆరోపణలపైనా ఎన్నికల సంఘం స్పందించింది. ఎస్ఐఆర్‌కు సంబంధించి జారీ చేసిన మూడు ఉత్తర్వుల వల్ల చట్టబద్ధంగా నిర్దేశించిన ఫారం–6లో ఎలాంటి మార్పులు జరగలేదని స్పష్టం చేసింది.కొత్తగా ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకోవడానికి ఫారం–6 ఉపయోగిస్తారు. అయితే ఎస్ఐఆర్ ప్రక్రియలో దీనికి అనుబంధంగా వినియోగించే 'డిక్లరేషన్ ఫారం' ప్రత్యేక పత్రం అని ఎన్నికల సంఘం వివరించింది. ఈ డిక్లరేషన్ ఫారం ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ప్రవేశపెట్టినదని తెలిపింది. ఫారం–6, డిక్లరేషన్ ఫారం రెండింటినీ ఒకటిగా పరిగణించకూడదని ఎన్నికల సంఘం తన వివరణలో స్పష్టం చేసింది. ఓటర్ల నమోదు ప్రక్రియలో ఈ పత్రాల పాత్రపై నెలకొన్న సందేహాలకు ఈ విధంగా సమాధానం ఇచ్చింది. ఇటీవల వెలువడిన ఒక వార్తా కథనం ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలు ఉన్నాయన్న చర్చకు దారితీసింది. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలకు కొన్ని నిర్ణయాల గురించి ముందుగా సమాచారం ఇవ్వలేదని వారు పలు అంశాలపై అభ్యంతరాలు వ్యక్తం చేశారని ఆ కథనం పేర్కొంది.

ఈ విషయాన్ని వారు ప్రధాన కార్యదర్శి దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు అందులో వెల్లడించింది. ఈ వార్తల నేపథ్యంలోనే ఎన్నికల సంఘం నిర్ణయాల ప్రక్రియను వివరిస్తూ సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. అయితే కమిషనర్ల మధ్య విభేదాలు ఉన్నాయన్న వార్తా కథనాలను సంఘం ఖండిస్తూ అధికారిక నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నట్లు పేర్కొంది. ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియలో పారదర్శకత, ఓటర్ల నమోదు నిబంధనలు, ఎన్నికల సంఘం నిర్ణయాల విధానం వంటి అంశాలపై దేశవ్యాప్తంగా చర్చ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం దాఖలు చేసిన అఫిడవిట్ సుప్రీంకోర్టు విచారణలో ప్రాధాన్యం సంతరించుకుంది. పిటిషన్లు వార్తా కథనాలపై ఆధారపడ్డాయని అందువల్ల వాటిని కొట్టివేయాలని ఎన్నికల సంఘం కోరింది. అయితే ఈ వాదనలపై సుప్రీంకోర్టు ఏ నిర్ణయం తీసుకుంటుందన్నది తదుపరి విచారణలో తేలనుంది. ఎన్నికల సంఘం వివరణ, పిటిషనర్ల వాదనలు, న్యాయస్థానం పరిశీలన ఆధారంగా ఎస్ఐఆర్ వివాదంలో తదుపరి పరిణామాలు చోటుచేసుకోనున్నాయి.

# హేట్ స్పీచ్ బిల్లును

# ఉపసంహరించుకోండి

లేవని అభ్యంతరం తెలిపింది. రాజకీయ విమర్శలు, ప్రభుత్వ విధానాలపై అసమ్మతి, మీడియా కథనాలు, ప్రజా సమస్యలపై చర్చలను కూడా నేరాల పరిధిలోకి తీసుకొచ్చే ప్రమాదం ఉందని పేర్కొంది. కేవలం విమర్శాత్మక వ్యాఖ్యలు చేసినంత మాత్రాన వాటిని నేరంగా పరిగణించకూడదని, హింసకు ప్రేరేపించే ఉద్దేశం, నిర్దిష్ట సందర్భం, వాస్తవమైన హాని జరిగే అవకాశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ సూచించింది.

### దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉంది

రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఏ) కల్పించిన భావప్రకటనా స్వేచ్ఛను పరిరక్షించాల్సిన అవసరాన్ని బీఆర్ఎస్ పేర్కొంది. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన పలు తీర్పులను ప్రస్తావించిన ఆ పార్టీ ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు, రాజకీయ అసమ్మతిని వ్యక్తం చేసే స్వేచ్ఛ కీలకమని పేర్కొంది. బిల్లులో ప్రతిపాదించిన శిక్షలు, అరెస్టు అధికారాలు, ముందస్తు నిరోధక చర్యలపై కూడా బీఆర్ఎస్ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. కొన్ని నిబంధనల ప్రకారం నాన్ బెయిలబుల్ నేరాలు, వారెంట్ లేకుండా అరెస్టు చేసే అవకాశం, ముందస్తు నిరోధక ఆదేశాలు అమలులోకి వస్తే అవి రాజకీయ ప్రత్యర్థులు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలపై దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ప్రభుత్వ అధికారుల విచక్షణాధికారాలకు పరిమితులు ఉండాలని, అరెస్టులకు స్పష్టమైన కారణాలు, న్యాయపరమైన పర్యవేక్షణ తప్పనిసరి చేయాలని సూచించింది. తప్పుడు లేదా రాజకీయ ప్రేరేపిత ఫిర్యాదులకు పాల్పడేవారిపై చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల హక్కులను కాపాడాలని పేర్కొంది.

### 30 రోజుల గడువు ఇవ్వాలి

హేట్ స్పీచ్ బిల్లును యథాతథంగా ఆమోదించకుండా ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ కోరింది. ఒకవేళ బిల్లును కొనసాగించాలని ప్రభుత్వం భావిస్తే, అందులో సమగ్ర మార్పులు చేయాలని సూచించింది. హింసకు ప్రేరేపించే ఉద్దేశంతో కూడిన ప్రసంగాలకే చట్టాన్ని పరిమితం చేయడం, హేట్ స్పీచ్‌ను ఇతర నేరాల నుంచి స్పష్టంగా వేరు చేయడం, అరెస్టులు, నిరోధక చర్యలకు న్యాయపరమైన రక్షణ కల్పించడం వంటి ప్రతిపాదనలను బీఆర్ఎస్ పార్టీ చేసింది. బిల్లుపై ప్రజాభిప్రాయ సేకరణకు కనీసం 30 రోజుల గడువు ఇవ్వాలని కోరింది. తెలుగు, ఉర్దూతో పాటు ఆంగ్లంలోనూ బిల్లును అందుబాటులో ఉంచాలని జర్నలిస్టులు, న్యాయ నిపుణులు, పౌర సమాజ ప్రతినిధులు, సాంకేతిక రంగ నిపుణుల అభిప్రాయాలను సెలెక్ట్ కమిటీ సేకరించాలని విజ్ఞప్తి చేసింది.

## సైక్లోన్‌పై ప్రతీ 4 గంటలకు హెచ్చరికలు జారీ చేయాలి

మోస్తరు నుంచి భారీ వర్షాలకు ఆస్కారం ఉందని తెలిపారు. అలాగే తీరప్రాంతాల వెంబడి బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని సీఎంకు తెలియచేశారు. తుఫాను ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్ర జిల్లాలు, కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పలనాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఈ నెల 28,29 తేదీల్లో భారీ వర్షాలు, కొన్ని చోట్ల అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వివరించారు. అర్నబ్ తుఫాన్ విషయంలో రాష్ట్రం తీసుకుంటున్న ముందస్తు చర్యలను ఎప్పటికప్పుడు కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

### షెల్టర్లకు లోతట్టు ప్రాంతాల ప్రజలు

తుఫాను ప్రభావం నేపథ్యంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. ముంపు ప్రాంతాల్లోని ప్రజలను తుఫాను షెల్టర్లకు తరలించాలని సీఎం నిర్ద?శించారు. వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణీలు, శిశువులకు తొలి ప్రాధాన్యతనిచ్చి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన 4,711 మంది గర్భిణీలను ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలకు, ఆస్పత్రులకు తరలించే ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ప్రభావిత జిల్లాల్లోని ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య బృందాలను, అంబులెన్సులను సిద్ధంగా ఉంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో 7 ఎన్డీఆర్ఎఫ్ 8 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను 11 ప్రభావిత జిల్లాల్లో మోహరించాలని సీఎం సూచించారు. ఎన్టీఆర్, విశాఖపట్నం జిల్లాల్లో అదనపు బలగాలను రిజర్వ్‌లో ఉంచాన్నారు. మెరైన్ పోలీసులతో పాటు నౌకాదళంతోపాటు కోస్టుగార్డుల సేవలను ఈ తుఫాన్ సహాయక చర్యల్లో వినియోగించుకునేలా చూడాలని సీఎం నిర్దేశించారు. సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులందరినీ సురక్షితంగా తీరప్రాంతానికి తిరిగి రప్పించామని అధికారులు వివరించారు. మొత్తం 30,043 పడవలు సురక్షితంగా హార్బర్‌లకు చేరుకున్నాయని తెలిపారు. తుఫాను బలహీన పడి సముద్రంలో సాధారణ పరిస్థితులు నెలకొనేంత వరకూ మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనలు జారీ చేశారు.

### పంటనష్టం వాటిల్లకుండా చర్యలు

కోసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు చేర్చేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి వ్యవసాయ శాఖను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్దేశించారు. దాదాపు 1.82 లక్షల హెక్టార్లలోని ఉద్యాన పంటలకు ముప్పు పొంచివున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రేషన్ దుకాణాల్లోనూ సరకులు అందుబాటులో ఉంచాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం వచ్చిన చోట తక్షణమే పునరుద్ధరించేలా చూడాలని స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు తుపాను గమనాన్ని అంచనా వేస్తూ ప్రతీ నాలుగు గంటలకూ ప్రజలకు హెచ్చరికతో కూడిన బులెటిన్ జారీ చేయాలని దిశానిర్దేశం చేశారు.

### విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించాలి

గతంలో వచ్చిన తుఫాన్ల సమాచారాన్ని విశ్లేషిస్తూ రైతులకు, ప్రజలను ఎప్పటికప్పుడు హెచ్చరించాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. అలాగే ఆర్నబ్ తుఫాను కారణంగా వివిధ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మొత్తం 22 రిజర్వాయర్ల పరిధిలో వరద ప్రవాహాలు వస్తాయని అధికారులు అంచనా వేశారు. ఈ ప్రవాహాలతో 10–12 టీఎంసీల మేర నీటిని నిల్వ చేసేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. తాండవ, రైవాడ, యేలేరు, తమ్మిలేరు, ఎర్రకాలువ, తాడిపూడి రిజర్వాయర్లకు పూర్తి స్థాయిలో నీటి నిల్వలు వచ్చే అవకాశం ఉందని సీఎం అన్నారు. వాగులు, వంకలు, కాలువల ప్రవాహాలకు అడ్డంకి లేకుండా చూడాలన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా తుఫాను ప్రభావంపై దుష్ప్రచారం చేసేందుకు ప్రయత్నిస్తే కఠినంగా వ్యవహరించాలని సీఎం జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఇక తుఫాన్ ప్రభావం ఏయే ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటుందో చూసి... ఆ మేరకు విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించాలని సీఎం సూచించారు. ప్రతి తుఫాన్ ప్రభావంపై ముఖ్యమంత్రి గంట గంటకూ అధికారుల నుంచి సమాచారాన్ని తీసుకుంటున్నారు. ఈ సమీక్షకు సీఎస్ సాయి ప్రసాద్, ఆర్టీజీఎస్, విపత్తు నిర్వహణ సహా వివిధ శాఖల అధికారులు, మంత్రి రామానాయుడు వర్చువల్‌గా హాజరయ్యారు.

## మెట్రో సెకండ్ ఫేజ్.. కీలక అడుగు

ఈ విస్తరణలో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుసంధానం కల్పించే నాగోల్-–ఎయిర్‌పోర్ట్ మార్గానికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ప్రాజెక్టును 2029 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించినట్లు మెట్రో అధికారులు వెల్లడించారు. ఫేజ్–2లో ప్రతిపాదించిన ఐదు కారిడార్లు నగరంలోని వివిధ ప్రాంతాలను మెట్రో నెట్‌వర్క్‌తో అనుసంధానించేలా రూపొందించారు. నాగోల్ నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు 36.8 కిలోమీటర్ల మార్గం ఈ ప్రణాళికలో అత్యంత పొడవైన కారిడార్‌గా ఉంది. రాయదుర్గం నుంచి కోకాపేట వరకు 11.6 కిలోమీటర్ల మార్గాన్ని ప్రతిపాదించారు.

ఐటీ, ఆర్థిక కార్యకలాపాలు వేగంగా విస్తరిస్తున్న ప్రాంతాలకు మెట్రో సేవలు చేరువ కావడం ఈ మార్గాల ప్రధాన ఉద్దేశంగా భావిస్తున్నారు.పాతబస్తీ మెట్రో విస్తరణలో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల కారిడార్‌ను ప్రతిపాదించారు. ఈ మార్గం అమల్లోకి వస్తే పాతబస్తీ ప్రాంతాల ప్రజలకు మెట్రో ప్రయాణ సౌకర్యం మరింత చేరువయ్యే అవకాశం ఉంటుంది. మరోవైపు.. మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు 13.4 కిలోమీటర్ల మార్గం ద్వారా పశ్చిమ హైదరాబాద్‌లోని నివాస, పారిశ్రామిక ప్రాంతాలకు మెట్రో కనెక్టివిటీ విస్తరించనుంది. ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు 7.1 కిలోమీటర్ల కారిడార్ తూర్పు దిశలో ప్రజా రవాణా సౌకర్యాలను మెరుగుపరచే లక్ష్యంతో ప్రతిపాదించారు. ఈ ఐదు కారిడార్ల నిర్మాణం పూర్తిచేసుకుని ప్రయాణికులకు అందుబాటులోకి వస్తే హైదరాబాద్ మెట్రో నెట్‌వర్క్ పరిధి మరింత విస్తరించనుంది. ప్రస్తుతం రహదారులపై పెరుగుతున్న వాహనాల రద్దీ, కార్యాలయ వేళల్లో ప్రయాణ ఆలస్యాలు, విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులు ఎదుర్కొంటున్న రవాణా సమస్యలను తగ్గించడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. ముఖ్యంగా ఐటీ కారిడార్, పాతబస్తీ, పటాన్‌చెరు, హయత్‌నగర్ వంటి ప్రాంతాల్లో ప్రజా రవాణాకు ప్రత్యామ్నాయ మార్గాలు పెరగనున్నాయి. అయితే ప్రాజెక్టు ఆమోదం తర్వాత నిర్మాణ పనుల ప్రారంభం, నిధుల సమీకరణ, భూసేకరణ, మార్గాలవారీగా పనుల పురోగతి వంటి అంశాలు కీలకం కానున్నాయి. అధికారికంగా ఆమోదించిన మార్గాలు, నిర్మాణ షెడ్యూల్, పూర్తి గడువు స్పష్టమైన తర్వాతే విస్తరణపై మరింత స్పష్టత రానుంది. నగర భవిష్యత్ రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని మెట్రో ఫేజ్–2 పనులు వేగంగా ముందుకు సాగాలని హైదరాబాద్ ప్రజలు ఆశిస్తున్నారు.ద

# ఇందిరమ్మ ఇళ్ల

## పెండింగ్ బిల్లులు త్వరలో జమ

ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ ప్రకటనతో బిల్లుల కోసం ఎదురుచూస్తున్న కుటుంబాల్లో ఆశలు చిగురించాయి. రాష్ట్రంలో అర్హులైన నిరుపేదలకు సొంతింటి కలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. ఇప్పటివరకు 8 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.40 వేల కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తోందని తెలిపారు. అర్హులైన పేదలందరికీ ఇళ్లు అందించేందుకు మరో మూడు, నాలుగు విడతల్లో కూడా మంజూరులు చేపడతామని వెల్లడించారు. దశాబ్దాలుగా సొంత ఇల్లు కోసం ఎదురుచూస్తున్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడానికి అవసరమైతే మరింత ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.ఆడబిడ్డల ఆత్మగౌరవానికి సొంత ఇల్లు ఎంతో ముఖ్యమని, మహిళల గౌరవప్రదమైన జీవనానికి భరోసా కల్పించడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని పొంగులేటి అన్నారు.

రాష్ట్ర విభజన తర్వాత కూడా గత ప్రభుత్వం పేదల సొంతింటి కలను పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి విడతలో 4.50 లక్షల ఇళ్లను, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు వివరించారు. హైదరాబాద్ మహానగరంలో మరో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టామని, ఇందిరమ్మ టవర్స్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు.నేలకొండపల్లి పర్యటనలో భాగంగా రెండో విడత ఇందిరమ్మ ఇళ్లకు అర్హత సాధించిన 145 మంది లబ్ధిదారులకు మంత్రి పొంగులేటి, జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మంజూరు పత్రాలను అందజేశారు. మండలంలో తొలి విడతలో మొత్తం 648 ఇళ్లు మంజూరు కాగా వాటిలో ఇప్పటికే 620 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న మిగిలిన ఇళ్ల పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మంజూరులు, నిర్మాణాల పురోగతితో పాటు బిల్లుల చెల్లింపులు కూడా లబ్ధిదారులకు కీలకంగా మారాయి. నిర్మాణం పూర్తయిన ఇళ్లకు తుది బిల్లులు సకాలంలో అందితే అప్పులు తీర్చుకోవడంతో పాటు ఇంటి పనులకు చేసిన ఖర్చులను సర్దుబాటు చేసుకునేందుకు పేద కుటుంబాలకు వెసులుబాటు కలుగుతుంది

# జడ్పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలి

**రంపచోడవరం :** జిల్లాలో జడ్పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రతి అధికారి సమన్వయంతో పనిచేయాలని పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ సూచించారు. సోమవారం స్థానిక మండల విద్యా శాఖ అధికారి కార్యాలయం లో ఏర్పాటు చేసిన ఎన్నికల విధుల నిర్వహణలో భాగంగా ప్రిసైడింగ్ అధికారులు (పీవోలు), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీవోలు)కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు అత్యంత కీలకమైనవని, ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ఎన్నికల సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలు, మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు.వై. రామవరం మండలం లోని జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల హ్యాండ్‌బుక్‌లో పొందుపరిచిన విధివిధానాలను పూర్తిగా అవగాహన చేసుకుని, వాటికి అనుగుణంగా విధులు నిర్వర్తించాలన్నారు.పోలింగ్‌కు ముందు చేపట్టాల్సిన ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రంలో అనుసరించాల్సిన విధానాలు, పోలింగ్ సామగ్రి వినియోగం, ఓటర్ల గుర్తింపు, ఓటింగ్ ప్రక్రియ, పోలింగ్ ముగిసిన అనంతరం చేపట్టాల్సిన చర్యలపై సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని ఆయన తెలిపారు.విధుల నిర్వహణలో ఎలాంటి సందేహాలు ఉన్నా శిక్షణ సమయంలోనే నివృత్తి చేసుకోవాలని, క్షేత్రస్థాయిలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఎన్నికల విధుల నిర్వహణకు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన సిబ్బందిని నియమించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో నిష్పక్షపాతంగా వ్యవహరించడం,ఎన్నికల నియమావళిని పాటించడం, ఓటర్లకు అవసరమైన సహకారం అందించడం, పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంత వాతావరణాన్ని కొనసాగించడం ప్రతి ఎన్నికల సిబ్బంది బాధ్యత కలెక్టర్ స్పష్టం చేశారు.మండలం లోని పీవోలు, ఏపీవోలు ఎన్నికల ప్రక్రియలో కీలక పాత్ర పోషిస్తారని, వారికి అందించిన శిక్షణను సద్వినియోగం చేసుకుని ఎన్నికల నిర్వహణకు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల సిబ్బంది మధ్య సమన్వయం, సమయపాలన, అప్రమత్తతతో పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని, ఎన్నికల సంఘం ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి సంబంధిత అధికారులు, ఎన్నికల సిబ్బంది సమష్టిగా కృషి చేసి ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆకాంక్షించారు. పోలవరం జిల్లాలో ఎన్నికల సిబ్బంది పోలింగ్కు సంబంధించిన సామాగ్రిని ఒకటికి రెండుసార్లు పూర్తిస్థాయిలో పరిశీలించుకోవాలన్నారు. ఎక్కడైనా లోటుపాట్లు ఉన్న యెడల వెంటనే రిటర్నింగ్ అధికారి వెంటనే తెలియజేయాలని ఆయన అన్నారు.ఈ శిక్షణ కార్యక్రమానికి ఆర్వో నరేంద్ర కుమార్, తహసీల్దార్ శ్రీరాములు,ఎంపీడీఓ కె. బాపన్న దొర, పి ఓ లు, ఏ పి ఓ లు తదితరులు పాల్గొన్నారు.





## జర్నలిస్టులకు ఇండ్లు ఇండ్ల స్థలాలు ప్రభుత్వం అందించాలి

**- ఎంపీడీవో కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్‌లో వినతి**

**దంతాలపల్లి** మండలంలోని వర్కింగ్ జర్నలిస్టులకు డబల్ బెడ్రూంలో ఇండ్లు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ కార్యక్రమంలో,తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పంతం సురేందర్ ఆధ్వర్యంలో తహశీ ల్దార్ సునీల్ కుమార్ రెడ్డి, ఎంపీడీవో శుక్రు కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి జర్నలిస్టులకు ఇచ్చిన మాట ప్రకారం ఇండ్ల స్థలాలు డబల్ బెడ్ రూమ్ ఇండ్లను అందజేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.ఎన్నో సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్న నిరుపేద జర్నలిస్టులుగా జీవితాన్ని కొనసాగిస్తున్నారనికావున జర్నలిస్టుల కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. గత కొన్ని రోజులుగా అక్రిడేషన్లు ఇచ్చి , హెల్త్ కార్డులు మంజూరు చేయకుండా కాలం కాలయాపన చేయడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రతి జర్నలిస్టుకు తప్పనిసరిగా ఇండ్ల స్థలం ఇల్లు డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్ జేయు జిల్లా నాయకులు పంతం విజయేందర్, జిల్లా సోషల్ మీడియా ఇన్చార్జి మిడతపల్లి సురేందర్, తొర్రూరు డివిజన్ ప్రధాన కార్యదర్శి జల్ల శ్రీనివాస్, డివిజన్ కోశాధికారి కాయితోజు శ్రీనివాస చారి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతల పట్టింపు లేని ఎన్నికల కమిషన్

**సికింద్రాబాద్.** బాధ్యతల పట్ల పట్టింపు లేకుండా ప్రవర్తిస్తుందని, ఎన్నికల కమిషన్ తీరు పట్ల మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అసహనం వ్యక్తం చేశారు. వెస్ట్ మారేడ్ పల్లి లోని క్యాంప్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన సనత్ నగర్ నియోజకవర్గ ముఖ్య నాయకుల జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నిసార్లు చెప్పినా ఎన్నికల కమిషన్ లో ఏ మాత్రం చలనం లేదని, గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించే బాధ్యత ఎన్నికల కమిషన్ ది కాదా? అని ప్రశ్నించారు. రాజకీయ పార్టీలు గా తాము ఓటరు నమోదు కార్యక్రమం చేపడితే అధికారులు అడ్డంకులు కల్పిస్తున్నారని, గతంలో హైదరాబాద్ నగరంలో 1.10 లక్షల గ్రాడ్యుయేట్ ఓటర్లు నమోదయ్యా రని తెలిపారు. నవంబర్ 6 తో ఓటరు నమోదు కార్యక్రమం ముగుస్తుంది. కానీ ఇప్పటి వరకు కేవలం 23 వేల దరఖాస్తులు మాత్రమే వచ్చాయని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ తో పాటు ప్రభుత్వం కూడా పట్టింపు లేకుండా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ బాధ్యతా రాహిత్యం వలన ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కరువు గురించి మాట్లాడుతూ ఇది ఎవరు తెచ్చిన కరువు అనేది ప్రజలకు, మీడియాకు అందరికి తెలుసని ఎద్దేవా చేశారు.

## ప్రశ్నార్థకంగా మారిన బార్ల మనుగడ

**ఖైరతాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం విధించిన ప్రివిలేజ్ టాక్స్‌తో బార్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్ అన్నారు. ఈ పన్నును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఖైరతాబాద్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో ఆయన నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా దామోదర్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రివిలేజ్ టాక్స్ కారణంగా ఒక్కో క్వార్టర్ మద్యం బాటిల్, బీర్‌పై రూ.60 అదనపు భారం వినియోగదారులపై పడుతోందన్నారు. వైన్ షాపుల నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా పర్మిట్ రూములు నిర్వహిస్తుండటంతో వినియోగదారులు బార్లకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. బార్ల ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరుతున్నప్పటికీ, తమ సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చూపుతోందని విమర్శించారు. పన్నును రద్దు చేసే వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాచాల యుగంధర్ గౌడ్ మాట్లాడుతూ.. ఎక్సైజ్ శాఖ కమిషనర్ అనాలోచిత నిర్ణయాల వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఒక్కో బార్‌పై సుమారు 40 మంది ఉపాధి పొందుతున్నారని, ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడంతోపాటు ఉపాధి కల్పిస్తున్న రంగంపై అధిక భారం మోపడం సరికాదన్నారు. ప్రభుత్వం తక్షణమే ప్రివిలేజ్ టాక్స్‌ను రద్దు చేయడంతో పాటు అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## లక్ష్మణ్ ఆరోగ్యగ్రామం ప్రథమ వార్షికోత్సవం

ఆరోగ్యగ్రామంఆరోగ్యకరమైన జీవనశైలి, పోషకాహారం, సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్న లక్ష్మణ్ ఆరోగ్యగ్రామం ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, అరుణోదయ విమలక్క, సినీ నటుడు సప్తగిరి, కిరాక్ ఆర్పీ, ఫైట్ మాస్టర్స్ రామ్‌లక్ష్మణ్, తదితరులు పాల్గొని నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మాట్లాడుతూ.. నేటి కాలంలో కల్తీ ఆహారం, ఫుడ్ సేఫ్టీ నిబంధనల ఉల్లంఘనలు ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్ తరాలకు ఆస్తులతో పాటు స్వచ్ఛమైన నీరు, నాణ్యమైన ఆహారం అందించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం, పోషకాహారం, పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. లక్ష్మణ్ పూడి స్థాపించిన లక్ష్మణ్ ఆరోగ్యగ్రామం ద్వారా సమతుల్య ఆహారం, వ్యాధుల నివారణ, శారీరక, మానసిక ఆరోగ్యం, ఆరోగ్యకరమైన జీవనశైలిపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## వాల్మీకి మహర్షి బోధనలు నేటి సమాజానికి మార్గదర్శకం

**ఊట్కూర్, అక్టోబర్ 26 :** సత్యం, ధర్మం, న్యాయం, మానవీయ విలువల ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన ఆదికవి వాల్మీకి మహర్షి జీవితం, ఆయన రచించిన రామాయణ మహాకావ్యం సమాజానికి స్ఫూర్తిదా యకమని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరిం చుకొని సోమవారం నారాయణపేట జిల్లా నర్వ మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిట్టెం రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. రామాయణం భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన అమూల్యమైన సాహిత్య సంపద అని పేర్కొన్నారు. వాల్మీకి మహర్షి బోధనలు నేటి సమాజానికి కూడా మార్గదర్శకమని, ఆయన చూపిన సత్యధర్మాల మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. ఊట్కూర్ మండలం నిడుగుర్తి, చిన్నపోర్ల, పెద్ద పోర్ల, కొత్తపల్లి తదితర గ్రామాల్లో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా షేక్ షఫీ పోటీ

**- నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం**

**హైదరాబాద్:** వరంగల్‌ఖమ్మంనల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ షేక్ షఫీ ప్రకటించారు. గత 20 ఏళ్లుగా వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్, కుటుంబ సంబంధాల మెరుగుదలపై అవగాహన కల్పిస్తున్నానని తెలిపారు. గత 34 రోజులుగా మూడు జిల్లాల్లోని సుమారు 38 పట్టణాల్లో పర్యటించి పట్టభద్రుల సమస్యలను తెలుసుకున్నట్లు చెప్పారు.నిరుద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, విద్యారంగంలో నాణ్యత పెంపు, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా ప్రభుత్వాలను ప్రశ్నించడమే తన లక్ష్యమన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజల గొంతుకగా చట్టసభల్లో సమస్యలను ప్రస్తావించేందుకు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.పట్టభద్రులు నిరాశతో ఓటు హక్కుకు దూరం కాకుండా, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహచర పట్టభద్రులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు. ఓటరు నమోదు, పోలింగ్ కేంద్రాల పెంపు, ఓటర్లకు మెరుగైన సౌకర్యాల కల్పనపై తెలంగాణ ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి సారించాలని షేక్ షఫీ విజ్ఞప్తి చేశారు.

## వచ్చే ఏడాది నుంచి ఖైరతాబాద్ వ్యాప్తంగా క్రీడలు నిర్వహిస్తాం

**పల్లపు గోవర్ధన్** ఇప్పటి వరకు జూబ్లీహిల్స్, ఫిలింనగర్ ప్రాంతాల్లో మాత్రమే నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను వచ్చే ఏడాది నుంచి ఖైరతాబాద్ నియోజక వర్గ వ్యాప్తంగా నిర్వహిస్తామని ఖైరతాబాద్ సీనియర్ నేత, భాగ్యనగర్ ఉత్సవ సమితి కార్యదర్శి పల్లపు గోవర్ధన్ అన్నారు. దసరా సందర్భంగా నిర్వహించిన పీజీ దసరా క్రికెట్ టోర్నమెంట్ బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం ఆదివారం ఫిలింనగర్‌లోని గౌతంనగర్ చౌరస్తాలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పల్లపు గోవర్ధన్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా ప్రతియేటా యువత కోసం క్రికెట్ టోర్నమెంట్లను నిర్వహిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నామని నియోజక వర్గంలోని అనేక డివిజన్ల నుంచి బస్తీల నుంచి తనకు ఫోన్లు వస్తున్నాయని తాము కూడా పాల్గొంటామని అవకాశం ఇవ్వాలని కోరుతున్నారని అన్నారు. వారి అభ్యర్ధన మేరకు వచ్చే యేడాది నుంచి నియోజక వర్గ స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహిస్తామని అన్నారు. ఫిలింనగర్ బస్తీలో పుట్టి పెరిగిన తనకు యువత ఎదుర్కొనే అనేక సమస్యలపై అవగాహన ఉందని అందుకే వారు చెడు మార్గంలో వెళ్ళవద్దు సదుద్దేశం తో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. అదే విధంగా మహిళలకు వచ్చే సంక్రాంతికి ముగ్గుల పోటీలు కూడా ఏర్పాటు చేస్తామని అన్నారు. యువతను ప్రోత్సహించేందుకు చేసిన ఈ కార్యక్రమానికి మంచి స్పందన లభించిందని అన్నారు. 15 రోజుల పాటు జరిగిన ఈ టోర్నమెంట్‌లో ఫిలింనగర్‌కు చెందిన 19 జట్లు పాల్గొనగా 47 మ్యాచ్‌లు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఫ్రెండ్స్ ప్లేయింగ్11 టీమ్ విజేతగా నిలవగా రన్నరప్‌గా దుర్గా భవానీనగర్ కుమార్ జట్టు నిలిచింది.

## ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటేయండి

**నెల్లూరు** పేదలు, బలహీన వర్గాలు రాజకీయ పదవుల్లో ఉండాలన్నదే వైఎస్ జగన్మోహన్ రెడ్డి లక్ష్యం. అందులో భాగంగా ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన షకీలా ని బుచ్చి మునిసిపల్ చైర్మన్ అభ్యర్థిగా ప్రసన్నన్న ప్రకటించడం సంతోషమని వైకాపా నేత అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. సోమవారం అయన షకీలాకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. అనిల్ మాట్లాడుతూ – బుచ్చిని మున్సిపాలిటీ చేసి అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రసన్న అన్న చాలా కష్టపడ్డారు. – ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటేయమని ప్రజలను అడుగుతున్నాం . 23 వార్డుల్లో పోటీలో ఉన్న వైసీపీ అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరుతున్నామని అన్నారు. కరోనా వలన మొదటి రెండేళ్లు ప్రజలకు అభివృద్ధి పనులు చేయలేక పోయాం... ఆ తరువాత మూడేళ్లు బుచ్చిలో తాగునీరు కోసం 80 కోట్లతో సంగం నుంచి పైప్ లైన్ తీసుకొచ్చిన ఘనత ప్రసన్నకుమార్ రెడ్డిదే. సెంట్రల్ లైటింగ్, సీసీ రోడ్లు అన్నీ ఆ రోజుల్లో జరిగినవే.. అందుకే ఓటు అడిగే అర్హత కేవలం వైసీపీ కి మాత్రమే ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక బుచ్చిలో అరాచకాలు పెరిగాయి... అభివృద్ధి లేదు... అడిగితె కేసులు పెట్టడం, రౌడీ షీట్ ఓపెన్ చేయడం సాధారణంగా మారింది. ఎలాగైనా ఈ ఎన్నికల్లో గెలవాలని కౌన్సిలర్ కి ఓ రేటు కార్పొరేటర్ కి ఓ రేటు ఫిక్స్ చేసి ఓట్లను కొనే స్థితికి వచ్చారు కూటమి నాయకులు. గతంలో వైసీపీ చేసింది కాబట్టి మేము చేశామని చంద్రబాబు చెప్తున్నారు... అది కరెక్ట్ కాదు.. బెదిరింపులు లెక్కచేయకుండా నిలబడిన అభ్యర్థులకు ధన్యవాదాలని అన్నారు. వైసీపీ ప్రభుత్వానికి నేటి కూటమి ప్రభుత్వ పాలనకు పోలిక చుస్తే ధరలు మండుతున్నాయి.. 2వేల నుంచి 5 వేల దాక అదనంగా ఖర్చు చేసే పరిస్థితి వచ్చింది . సంతలో మాదిరిగా అభ్యర్థులను, ఓట్లను కొనేలా కూటమి తయారైంది..

## టీడీపీ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

**ఎమ్మిగనూరు** ఎమ్మిగనూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వాల్మీకి మహర్షి జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయ నాగేశ్వర్ రెడ్డి పాల్గొని వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి గారు మాట్లాడుతూ మహర్షుల మహోన్నత ఆలోచనలు, వారు చూపిన మార్గం తరతరాలకు దిశానిర్దేశం చేస్తాయని తెలిపారు. భారతీయ సంస్కృతికి, సాహిత్య వైభవానికి వాల్మీకి మహర్షి అందించిన సేవలు చిరస్మరణీయమని, ఆయన రచించిన రామాయణం మానవ విలువలు, ధర్మం, నీతి, ఆదర్శవంతమైన జీవన విధానాలకు ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు.వాల్మీకి మహర్షి జీవితం, ఆశయాలు నేటి యువతకు స్ఫూర్తిగా నిలవాలని, ఆయన బోధించిన విలువలను ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వాల్మీకి, బోయ సామాజిక వర్గాల నాయకులు, మండల నాయకులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు అమరుల త్యాగాలు చిరస్మరణీయం

**- పోలీసుల ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ - హుజురాబాద్ ఏసిపి మాధవి**



**హుజురాబాద్ :** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా హుజురాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాధవి మాట్లాడుతూ, విధి నిర్వహణలో ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు చేస్తున్న సేవలను గుర్తు చేసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు ధైర్యాన్ని, మనోధైర్యాన్ని ప్రసాదించాలని, వారు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ సైకిల్ ర్యాలీ ద్వారా ప్రజల్లో పోలీసుల సేవల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ పట్టణ సీఐ కరుణాకర్, రూరల్ సీఐ వీరబత్తిని శ్రీనివాస్ జమ్మికుంట టౌన్, రూరల్ లు రామకృష్ణ గౌడ్, పులి వెంకట్ గౌడ్, ఎస్ఐలు రవి, శేఖర్ రెడ్డి, తిరుపతి, స్వాతి సర్పంచ్ కట్కూరు మల్లారెడ్డి కౌన్సిలర్లు భాస్కర్, రమేష్, సునీత లతో పాటు ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా అలై బలై కార్యక్రమం



గోదావరిఖని : శ్రీ లక్ష్మి ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన అలై బలై కార్యక్రమం కన్నుల పండువగా సాగింది. వివిధ కుల సంఘాల ప్రతినిధులు, రాజకీయ పక్షాల కార్మిక సంఘ నాయకులతో పాటు కళాకారుల బృందాలు ఆటపాటలతో ఆహుతులను అలరించారు అలరించారు. ఆలయబలై వ్యవస్థాపక చైర్మన్ సామాజిక ఐక్యవేదిక కన్వీనర్ క్యాతం వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మొదటగా వీటి స్వామి మృతి పట్ల సంతాపం తెలియజేసి, నషాముక్తభారత్ ప్రతిజ్ఞ చేయడం జరిగింది. సామాజిక వెత్తల జ్యోతి ప్రజ్వలన అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ సమాజంలో అనేక కులాలాగ ఏర్పడి వృత్తి వృత్తి రీత్యా ఎవరి జీవన విధానంలో వారు పనిచేస్తున్నప్పటికీ మనమంతా ఒక్కటే అనే భావనను కల్పించుటకు అలైబలై వేదిక ఉపయోగపడుతుందని సమాజ హితం కోసం అందరిని ఏకతాటిపై తీసుకురావడం కోసం 14 సంవత్సరాలుగా అలాగే బలై వేదిక ద్వారా చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. దురాక్రమణదారుల మనవారే పగవారుగా మారే పరిస్థితిని పారద్రోలుటకు దసరా సందర్భాన్ని పురస్కరించుకొని మన పూర్వీకులు ఈ అలైబలై ఏర్పాటు చేసి ఉండవచ్చని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. కార్యక్రమం లో పాల్గొన్న వివిధ కుల సంఘాల 400 వందలమంది ప్రతినిధులకు సభా వేదికపై కండువాతో సత్కరించారు. ఆహ్వాన సమితి అధ్యక్షుడు తన పెల్లి సారయ్య, ప్రధాన కార్యదర్శి రెడ్డి భాస్కర్,బండారి రాజమల్లు, ఆహ్వాన సమితి సభ్యులు బూడిద మహేందర్, అంశాల వీరేశం లు ఉండగా మాట్లాడిన ప్రముఖులలో కందుల సంధ్యారాణి, వ్యాల హరీష్ రెడ్డి, కార్పొరేటర్లు తోట మమత కుమారస్వామి, మార్కాపురం సూర్య, సిపిఐ నాయకులు తాండ్ర సదానందం, కనకరాజు, సిపిఎం నాయకులు వ పద్మ, రమాదేవి, కుల సంఘాల నాయకులు, శ్రీ రాజయ్య, దుండే మల్లేష్,క్యాతం సురేష్, శ్రీనివాస్, లక్ష్మణ్ యాదవ్, దబ్బేడ కమల్ జనగామ సాగర్, బొందయ్య, మైస రాజేష్ పి ఆర్ టి యు నాయకులు కానుగంటి శ్రీని వాస్,సమ్మయ్య, మూర్తి, భాగ్యలక్ష్మి లు ఉన్నారు.కార్యక్రమం అనంతరం తెలంగాణ వంటకాలైన తలకాయ కూర, పాయ, కాళ్ల కూర, కోడి కూర, బోటి, దాల్చా, గోధుమ రొట్టెలు, బబ్బర గారెలు, పెసరుగారలు, మక్క గారెలు, రాగిసంకటి మొక్కజొన్న ఘటక, తెల్ల జొన్నగటుక, రాగి జావా శనిగ గుడాలు, బబ్బర గుడాలు, కందిపప్పు, పచ్చిపులుసు వచ్చిన వారికి అందజేశారు.

## ఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం



**గోదావరిఖని:** పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఇండో-అమెరికన్ స్కూల్‌కు చెందిన విద్యార్థినీ, విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు పోలీస్ శాఖలో వినియోగిస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం,ప్రజలకు అందిస్తున్న వివిధ పోలీస్ సేవలు, డయల్-112,షీ టీమ్స్,సైబర్ క్రైమ్, డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల కలిగే నష్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.అదేవిధంగా పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్ సెంటర్,స్టేషన్ రైటర్, వి.హెచ్.ఎఫ్.సెట్, టెలికాన్ఫరెన్స్, ఆన్‌లైన్ ఎఫ్ఐఆర్, పార్ట్ మ్యాప్, ఆయుధాల భద్రపరిచే గది,సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ రూమ్ తదితర విభాగాల పనితీరును విద్యార్థులకు వివరించారు. మైనర్లు వాహనాలు నడపకూడదని, మోటార్ వాహన చట్టాలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు.వివిధ రకాల బందోబస్తు విధులు, సమాజంలో పోలీసుల పాత్ర, బాధ్యతలు, నేరాల నివారణలో పోలీసుల ప్రాధాన్యత గురించి వివరించారు.నేరస్తులను గుర్తించడంలో ఉపయోగించే ఫింగర్‌ప్రింట్ టెక్నాలజీ,ఆధునిక దర్యాప్తు విధానాలు, ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏదైనా నేరం లేదా సమస్య జరిగినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, అవసరమైతే నేరుగా సమీప పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు.ప్రజలకు మరింత భరోసా,నమ్మకం కలిగేలా పోలీస్ స్టేషన్లలో రిసెప్షన్ సెంటర్లను ఏర్పాటు చేసి,అక్కడికి వచ్చే బాధితుల సమస్యలను సానుకూలంగా విని, అవసరమైన సందర్భాల్లో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, చట్టపరిధిలో సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు విద్యార్థులకు వివరించారు.అలాగే ఓపెన్ హౌస్ కార్యక్రమానికి హాజరైన విద్యార్థినీ, విద్యార్థులు తమ ఇళ్లకు వెళ్లిన తర్వాత తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువులు లేదా చుట్టుపక్కల ప్రజలకు ఏదైనా సమస్య ఎదురైతే నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలని తెలియజేయాలని సూచించారు.ప్రజల రక్షణ,భద్రత కోసం పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని వారికి తెలియజేయాలని కోరారు.విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో విద్య ఎంతో ముఖ్యమైనదని, చదువు ఒక్కటే విద్యార్థుల జీవితాల్లో మంచి మార్పును తీసుకురాగలదని పేర్కొన్నారు.



# జైలర్ 2 బాక్సాఫీస్ సునామీ..

## 11 రోజుల్లోనే రూ.700 కోట్లకు పైగా వసూళ్లు!

సూపర్‌స్టార్ రజనీకాంత్ మరోసారి బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటుతున్నారని ట్రేడ్ వర్గాల గణాంకాలు చెబుతున్నాయి. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'జైలర్ 2' భారీ వసూళ్లతో దూసుకెళ్తోంది. విడుదలైన మొదటి వారంలోనే మంచి వసూళ్లు సాధించిన ఈ చిత్రం.. రెండో వారాంతంలోనూ అదే జోరును కొనసాగించినట్లు సమాచారం. ట్రేడ్ అంచనాల ప్రకారం, కేవలం 11 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.700 కోట్ల గ్రాస్ వసూళ్ల మార్కును దాటింది. దీంతో రజనీకాంత్ అభిమానుల్లో ఈ సినిమాపై ఉత్సాహం మరింత పెరిగింది. సాధారణంగా భారీ అంచనాలతో విడుదలైన సినిమాలకు తొలి వారాంతంలో మంచి వసూళ్లు వచ్చినప్పటికీ, ఆ తర్వాత కలెక్షన్లు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుంది. అయితే 'జైలర్ 2' విషయంలో రెండో వారాంతంలోనూ వసూళ్ల జోరు కొనసాగినట్లు ట్రేడ్ నివేదికలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా రెండో ఆదివారం సినిమా కలెక్షన్లు పెరిగినట్లు సమాచారం. ఆ ఒక్క రోజే దేశవ్యాప్తంగా సుమారు రూ.25.70 కోట్ల నికర వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ గణాంకాలు పేర్కొంటున్నాయి. రెండో వారాంతంలోని మూడు రోజుల్లో కలిపి దాదాపు రూ.64.35 కోట్ల నెట్ వసూళ్లు వచ్చినట్లు అంచనా. ట్రేడ్ వర్గాల గణాంకాల ప్రకారం, 'జైలర్ 2' ప్రపంచవ్యాప్త గ్రాస్ వసూళ్లు రూ.710.35 కోట్లకు చేరినట్లు సమాచారం. ఇందులో దేశీయ మార్కెట్ నుంచి సుమారు రూ.466.85 కోట్లు, విదేశీ మార్కెట్ల నుంచి దాదాపు రూ.243.50 కోట్ల గ్రాస్ వచ్చినట్లు అంచనాలు చెబుతున్నాయి. ఇక దేశవ్యాప్తంగా నికర వసూళ్లు సుమారు రూ.398.70 కోట్లకు చేరినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. ఇదే జోరు కొనసాగితే త్వరలోనే రూ.400 కోట్ల నెట్ మార్కును కూడా అందుకునే అవకాశం ఉంది. అయితే ఇవి ట్రేడ్ అంచనాల ఆధారంగా వచ్చిన గణాంకాలు కావడంతో, అధికారిక వసూళ్ల వివరాలతో పోల్చి చూడాల్సి ఉంటుంది. 'జైలర్ 2' తెలుగు వెర్షన్ కూడా బాక్సాఫీస్ వద్ద విశేష ఆదరణ పొందినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. విడుదలైన పది రోజుల్లోనే తెలుగు రాష్ట్రాల్లో రూ.100 కోట్ల గ్రాస్ మార్కును దాటినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ గణాంకాలు నిజమైతే, తెలుగు రాష్ట్రాల్లో ఈ స్థాయి వసూళ్లు సాధించిన తొలి తమిళ చిత్రంగా 'జైలర్ 2' నిలిచినట్లవుతుంది. ఆదివారం ఒక్కరోజే తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు రూ.4.75 కోట్ల గ్రాస్ వసూళ్లు వచ్చినట్లు సమాచారం. సాధారణంగా ఇతర భాషల చిత్రాలకు తెలుగు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తుంటుంది. అయితే రజనీకాంత్ సినిమాకు ఈ స్థాయిలో స్పందన రావడం ఆయనకు తెలుగు ప్రేక్షకుల్లో ఉన్న క్రేజ్‌ను మరోసారి చాటుతోందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

# నా బ్రెయిన్ వాడలేదు..

## – సీత పాత్రపై సాయిపల్లవి ఇంట్రెస్టింగ్ కామెంట్స్

డ్యాన్సర్‌గా, నటిగా తమిళం, మలయాళంతోపాటు తెలుగులో సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న భామల్లో టాప్‌లో ఉంటుంది సాయిపల్లవి. డైరెక్టర్ ఇచ్చిన పాత్రకు ప్రాణం పోయాలంటే సాయిపల్లవి తర్వాతే ఎవరైనా అని అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఓ వైపు గ్లామర్ రోల్స్ చేస్తూనే.. మరోవైపు నటనకు ఆస్కారమున్న సినిమాలు చేసే సాయిపల్లవి ప్రస్తుతం బాలీవుడ్ మాగ్నమ్ ఓపస్ ప్రాజెక్టు రామాయణలో సీతగా నటిస్తుందని తెలిసిందే. దర్శకుడు ఇచ్చిన ఏ రోల్ అయినా సరే తన మార్క్ యాక్టింగ్ ఉండేలా చూసుకుంటుంది సాయిపల్లవి. ఈ బ్యూటీ బాలీవుడ్ స్టార్ అమితాబ్ బచ్చన్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న కౌన్ బనేగా కరోర్‌పతి షోలో ఆసక్తికర కామెంట్స్ చేసింది. తాను రెగ్యులర్‌గా పోషించే పాత్రల కంటే భిన్నమైన వ్యక్తిత్వం ఉన్న సీత పాత్రను పోషించే అవకాశం రావడం గొప్ప బాధ్యత అని చెప్పింది సాయిపల్లవి. 'నేను పోషించిన ప్రతీ పాత్రకు నా వెర్షన్‌తోపాటు ఇన్‌పుట్స్ ఇచ్చేదాన్ని. కానీ సీత పాత్ర పోషిస్తున్న సమయంలో అంతటి పవిత్రమైన వ్యక్తిత్వం కలిగిన పాత్ర నుంచి నేనేం పొందగలనో అనే దాని గురించి మాత్రమే ఆలోచించాను. నేను నా బుర్రను (మెదడు) అస్సలు ఉపయోగించలేదు. నేను కేవలం సీతమ్మ ఆశీర్వాదాలు తీసుకొని ఆమె పాత్రను ఆకళింపు చేసుకున్నా'నంటూ చెప్పుకొచ్చింది. కౌన్ బనేగా కరోర్‌పతి షోలో సాయిపల్లవి చేసిన ఈ కామెంట్స్ సీతాదేవి పట్ల ఆమెకున్న గౌరవాన్ని చెప్పకనే చెబుతూనే.. మరోవైపు బిగ్ బీని ఇంప్రెస్ చేశాయి.





# ఆ ఆలస్యం నాకిష్టంలేదు

చేసే పనిగంటల విషయంలో ఎంత కచ్చితంగా ఉంటారో.. చేసే పని విషయంలో అంత నిబద్ధతగా, బాధ్యతగా ఉంటారు బాలీవుడ్ అగ్ర నటి దీపికా పదుకోన్. పని గంటల విషయంలో ఆమె వివాదంలో చిక్కుకున్నప్పటికీ.. పని విషయంలో మాత్రం ఏనాడూ ఆమె విమర్శల పాలవ్వలేదు. షూటింగులకు లేట్‌గా వచ్చిన దాఖలాలు కూడా లేవు. అట్లీ, అల్లు అర్జున్‌ల 'రాకా' చిత్రంలోని తన భాగాన్ని పూర్తి చేసిన తర్వాతే ప్రసూతి విరామాన్ని తీసుకున్నారు దీపిక. గత నెల 19న ఆమె ఓ ఆడబిడ్డకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. సాధారణంగా ఇలాంటి సందర్భాల్లో తిరిగి షూటింగుల్లో పాల్గొనేందుకు ఏ నటి అయినా ఓ ఆరు నెలలు విరామం తీసుకుంటుంది. కానీ దీపిక.. బిడ్డకు జన్మనిచ్చిన కేవలం 37 రోజుల్లోనే తిరిగి షూటింగ్‌లో పాల్గొంటున్నారు. సోమవారం(నేడు) నుంచే ఆమె షారుక్‌ఖాన్ 'కింగ్' సెట్స్‌లో ఎంట్రీ ఇవ్వనున్నారు. షారుక్, దీపికాలపై దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ ఓ పాటను చిత్రీకరించనున్నారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ 'మళ్లీ పనిలో బిజీ కావడం ఆనందంగా ఉంది. 'అప్పుడే షూటింగా?'అంటూ చాలామంది ప్రశ్నిస్తున్నారు.

వారికి నేనిచ్చే సింపుల్ సమాధానం ఒక్కటే.. 'తప్పదు'. ఎందుకంటే.. డిసెంబర్ 24న 'కింగ్'ని విడుదల చేయనున్నట్టు నిర్మాతలు ఇప్పటికే ప్రకటించారు. నా వల్ల వారి సినిమా లేట్ కావడం నాకిష్టం లేదు' అంటూ చెప్పుకొచ్చారు దీపిక పదుకోన్. వృత్తి పట్ల ఆమెకున్న నిబద్ధతకు ఇదే నిదర్శనం అంటూ పలువురు అభినందనలు అందిస్తున్నారు.

# విశ్వక్ సేన్ ఫ్యాన్స్ మీట్‌లో గందరగోళం..

## – అభిమానులకు క్షమాపణలు చెప్పినా తగ్గని విమర్శలు!



మాస్ కా దాస్ విశ్వక్ సేన్ నటిస్తున్న తాజా చిత్రం 'కల్ట్' విడుదలకు ముందే వార్తల్లో నిలుస్తోంది. అయితే ఈసారి సినిమా కారణంగా కాకుండా, అభిమానుల కోసం ఏర్పాటు చేసిన ఫ్యాన్స్ మీట్ అర్ధాంతరంగా రద్దు కావడంతో చర్చనీయాంశంగా మారింది. హైదరాబాద్‌లోని సారథి స్టూడియోలో ఆదివారం విశ్వక్ సేన్‌తో ఫొటోలు దిగేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అంచనాలకు మించి అభిమానులు తరలిరావడంతో అక్కడ ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. పరిస్థితి అదుపు తప్పే ప్రమాదం ఏర్పడటంతో నిర్వాహకులు ఫ్యాన్స్ మీట్‌ను మధ్యలోనే నిలిపివేశారు. విశ్వక్ సేన్‌ను నేరుగా కలుసుకుని ఫొటోలు దిగాలనే ఉత్సాహంతో తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో అభిమానులు సారథి స్టూడియోకు చేరుకున్నారు. అయితే వచ్చిన జనసందోహానికి తగిన స్థాయిలో ఏర్పాట్లు లేకపోవడంతో ప్రాంగణంలో రద్దీ పెరిగింది. తోపులాట చోటుచేసుకోవడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. తొక్కిసలాట జరిగే ప్రమాదాన్ని గుర్తించిన నిర్వాహకులు కార్యక్రమాన్ని అర్ధాంతరంగా రద్దు చేసారు. ఎంతో ఆశతో వచ్చిన అభిమానులు తమ అభిమాన హీరోతో ఫొటో దిగే అవకాశం దక్కకపోవడంతో నిరాశకు గురయ్యారు. కొందరు అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అక్కడ ఏర్పాటు చేసిన ప్రచార ఫ్లెక్సీలు, బ్యానర్లను తొలగించి నిరసన తెలిపారు. ఈ ఘటనతో 'కల్ట్' చిత్ర బృందం నిర్వహణపై విమర్శలు మొదలయ్యాయి. ఈ పరిణామాలపై విశ్వక్ సేన్ స్పందించారు. ఫ్యాన్స్ మీట్‌లో అభిమానులకు కలిగిన అసౌకర్యానికి విచారం వ్యక్తం చేస్తూ సామాజిక మాధ్యమాల ద్వారా క్షమాపణలు చెప్పారు. అభిమానుల నుంచి వచ్చిన ప్రేమాభిమానాలు తమ అంచనాలకు మించి ఉన్నాయని, అందరినీ కలవాలని తాను ఎంతో కోరుకున్నప్పటికీ తగిన ఏర్పాట్లు లేక ప్రతి ఒక్కరితో ఫొటోలు దిగడం సాధ్యం కాలేదని పేర్కొన్నారు. తనతో ఫొటో దిగాలనే ఆశతో వచ్చి నిరాశతో వెనుదిరిగిన ప్రతి ఒక్కరికీ క్షమాపణలు తెలిపారు. అభిమానులను పలకరించలేకపోయినందుకు బాధగా ఉందని వెల్లడించారు. త్వరలోనే మరింత మెరుగైన ఏర్పాట్లతో మరో ఫొటో సెషన్ నిర్వహించి, వీలైనంత ఎక్కువ మంది అభిమానులకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. తనపై చూపిస్తున్న ఆదరణకు కృతజ్ఞతలు తెలిపారు. విశ్వక్ సేన్ క్షమాపణలు చెప్పినప్పటికీ, కొందరు నెటిజన్లు మాత్రం చిత్ర బృందంపై విమర్శలు గుప్పిస్తున్నారు. అభిమానులు భారీ సంఖ్యలో వస్తారని ముందుగానే అంచనా వేసి తగిన భద్రతా ఏర్పాట్లు చేయాల్సిందని అభిప్రాయపడుతున్నారు. ఇటీవల నాని, విజయ్ దేవరకొండ అభిమానులతో నిర్వహించిన కార్యక్రమాలను ప్రస్తావిస్తూ.. ఇలాంటి కార్యక్రమాల్లో జనసందోహాన్ని నియంత్రించేందుకు పక్కా ప్రణాళిక అవసరమని వ్యాఖ్యానిస్తున్నారు. అభిమానులు ఎంతో దూరం నుంచి వచ్చి నిరాశతో వెనుదిరగాల్సి వచ్చిన తర్వాత క్షమాపణలు చెప్పడం మాత్రమే సరిపోదని కొందరు ప్రశ్నిస్తున్నారు. అయితే మరోవైపు, అభిమానుల నుంచి వచ్చిన అనూహ్య స్పందన కారణంగానే పరిస్థితి అదుపు తప్పిందని భావిస్తున్నవారూ ఉన్నారు.

# తరాలపాటు గుర్తుండే సినిమా



విశ్వదేవ్ రాచకొండ, బిందుమాధవి ప్రధానపాత్రలు పోషిస్తున్న చిత్రం 'డార్క్ చాక్లెట్'. శశాంక్ శ్రీవాస్తవ్ దర్శకుడు. స్పిరిట్ మీడియా, వాల్టెయిర్ ప్రొడక్షన్స్ కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రం నవంబర్ 13న విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ని మేకర్స్ లాంచ్ చేశారు. 'ఈ సినిమా ఆడియన్స్‌కి ఓ మిర్రర్ రిఫ్లెక్షన్‌లా అనిపిస్తుంది. నెవర్ బిఫోర్..నెవర్ ఆఫ్టర్ లాంటి సినిమా ఇది. తెలుగువారు గర్వంగా చెప్పుకునేలా సినిమా ఉంటుంది. ఈ కథలో చాలా లేయర్లుంటాయి. ఆడియన్స్‌కి ఓ కొత్త అనుభూతినిచ్చే సినిమా అవుతుంది. తరాలపాటు గుర్తుండిపోయే బెంచ్ మార్క్ సినిమా ఇది' అని హీరో విశ్వదేవ్ చెప్పారు. ఇలాంటి సినిమా తెలుగులో రాలేదనడంలో సందేహం లేదని దర్శకుడు శశాంక్ శ్రీవాస్తవ్ అన్నారు. ఇంకా నటి బిందుమాధవి, రాకేష్ రాచకొండ, ప్రొడక్షన్ డిజైనర్ నాగవ్ కూడా మాట్లాడారు. ఈ చిత్రానికి సంగీతం: వివేక్ సాగర్, సమర్పణ: రానా దగ్గుబాటి.

# ధనుష్ రాజకీయాల్లోకి రావడం ఖయమా..



తమిళనాడు రాజకీయాలకు, సినీ రంగానికి విడదీయలేని అనుబంధం ఉంది. వెండితెరపై స్టార్‌డమ్ సంపాదించుకున్న పలువురు నటులు రాజకీయాల్లోనూ తమదైన ముద్ర వేశారు. తాజాగా నటుడు విజయ్ రాజకీయాల్లోకి ప్రవేశించి తన పార్టీతో ముందుకు సాగుతున్న నేపథ్యంలో.. మరో కోలీవుడ్ స్టార్ ధనుష్ కూడా అదే బాటలో పయనించబోతున్నారా? అనే చర్చ మొదలైంది. గత కొంతకాలంగా ధనుష్ రాజకీయ ప్రవేశంపై ఊహాగానాలు వినిపిస్తుండగా, ఆయన అభిమాన సంఘాలతో నిర్వహిస్తున్న సమావేశాలు ఈ చర్చకు మరింత ఊతమిస్తున్నాయి. ధనుష్ సినిమాలతో బిజీగా ఉంటూనే అభిమాన సంఘాల ప్రతినిధులతో వరుసగా సమావేశమవుతున్నారనే వార్తలు కోలీవుడ్‌లో ఆసక్తిని పెంచుతున్నాయి. ఇటీవల ఢిల్లీలో చర్చలు జరిపినట్లు ప్రచారం జరగగా, తాజాగా చెన్నైలో మహిళా అభిమాన సంఘాల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. చోళింగనల్లూరులోని జేబీఆర్ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి 58 జిల్లాల నుంచి 2,500 మందికి పైగా మహిళా అభిమానులు హాజరైనట్లు తెలుస్తోంది. భారీ సంఖ్యలో అభిమానులను ఒకచోట చేర్చడం, జిల్లాలవారీగా అభిమాన సంఘాలను చురుగ్గా మార్చడం వంటి పరిణామాలతో ధనుష్ రాజకీయ ప్రవేశానికి ఇప్పటి నుంచే పునాది వేస్తున్నారా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అయితే ఈ సమావేశాల వెనుక రాజకీయ లక్ష్యం ఉందని ధనుష్ అధికారికంగా ప్రకటించలేదు. 2031 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ధనుష్ ఐదేళ్ల ముందుగానే రాజకీయ వ్యూహాన్ని సిద్ధం చేసుకుంటున్నారనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. అభిమాన సంఘాలు సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి సారిస్తున్నాయన్న వార్తలు ఈ ప్రచారానికి మరింత బలం చేకూరుస్తున్నాయి. ధనుష్ రాజకీయాల్లోకి వస్తారనే ప్రచారం నేపథ్యంలో టీవీకే నేతల వ్యాఖ్యలు కూడా చర్చనీయాంశంగా మారాయి. ధనుష్ రాజకీయాల్లోకి వస్తే స్వాగతిస్తామని చెబుతూనే, విజయ్‌లా తొలి ప్రయత్నంలోనే ముఖ్యమంత్రి కావడం అంత సులభం కాదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు వార్తలు వస్తున్నాయి. టీవీకే నేత అధవ్ అర్జున్ చేసినట్లు ప్రచారంలో ఉన్న వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. డీఎంకేను ఉద్దేశించి 'సైతాన్లు పోయారు.. ఇప్పుడు పిల్ల సైతాన్లు వస్తున్నారు' అంటూ ఆయన సెటైర్లు వేసారు. ఈ వ్యాఖ్యలు ధనుష్ రాజకీయ ప్రవేశంపై జరుగుతున్న చర్చకు మరింత ఆసక్తిని జోడించాయి.

# అనురాగం అవనిజగా మారిన రూపం



దేశవ్యాప్తంగా ఉన్న సినీప్రియులంతా ఆతృతగా ఎదురు చూస్తున్న చిత్రాల్లో నితీశ్ తివారీ తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా పౌరాణిక దృశ్యకావ్యం 'రామాయణం' ఒకటి. ఇందులో సీతారాములుగా సాయిపల్లవి, రణబీర్‌కపూర్ నటిస్తున్న విషయం తెలిసిందే. దాదాపుగా మూడువేల కోట్ల నిర్మాణ వ్యయంతో రెండు భాగాలుగా నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్న ఈ చిత్రం దీపావళి కానుకగా నవంబర్ 5న విడుదల కానున్నది. ఈ సినిమా సంగీత ప్రయాణంలో భాగంగా 'రంగులు రంగులే..' అంటూ సాగే ఈ సినిమాలోని గీతాన్ని ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. సీతారాముల ప్రేమకథను అద్భుతమైన విజువల్స్‌తో ఈ పాటలో చూపించారు. అందమైన ప్రకృతి, వైభవోపేతమైన రాజప్రాసాదాలు, సీతారాముల వివాహ వేడుకలు ఈ పాటలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. హిందీతోపాటు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఒకేసారి ఈపాటను విడుదల చేశారు. 'నువ్వే నా జీవం.. లోకాన.. అనురాగం అవనిజగా మారిన రూపం కనుదీపం.. వైభోగమే వర్షించావు నా కోసం.. హృదయం నీ ధామం.. ఈ జన్మ నీకంకితం.. నీతోడే ఉంటే రంగులు రంగులే.. మంగళ భరితమే.. ప్రేమనే రంగుల సౌధం..' అంటూ సాగే ఈ పాట తెలుగు వెర్షన్‌ను రాకేందు మౌళి రాయగా, ఏఆర్ రెహమాన్ స్వరపరిచారు. రాఘవ్ కౌశిక్, వైశాలి సామంత్ ఆలపించారు. 'యుగయుగాలుగా జన హృదయాల్లో జీవిస్తున్న రామాయణ గాథను సంగీతం ద్వారా ఆవిష్కరించే అవకాశం రావడం నా అదృష్టం. సీతారాముల ప్రేమభావాలను సంగీతంలో ప్రతిబింబించేందుకు ప్రయత్నించాను. ఈ 'రంగులు రంగులే..' పాట ప్రేక్షకుల్లో భక్తిభావంతో పాటు అనిర్వచనీయమైన ఆనందాన్ని, ప్రేమానుభూతిని అందిస్తుందని నా నమ్మకం' అని మ్యూజిక్ డైరెక్టర్ ఏఆర్ రెహమాన్ అన్నారు.

# వరిగుంతం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉపేందర్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) మెదక్ జిల్లా కొల్చారం మండలం వరిగుంతం గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా జోగిపేట ఉపేందర్ , ఉపాధ్యక్షుడిగా అచ్చునపల్లి శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా ముత్యాల భూమేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. కార్యకర్తలందరికీ సముచిత గౌరవం కల్పిస్తూ సమన్వయంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ముత్యంగారి గోవర్ధన్, వార్డు సభ్యులు బోడ దాస్ గౌడ్, రమేష్, పెంట్యా, మాజీ ఎంపీటీసీ, పార్టీ సీనియర్ నాయకుడు రామకృష్ణయ్య, చంద్రశేఖర్, పెంటయ్య, మల్లేశం, కిష్టయ్యతో పాటు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముదిరాజ్‌లను బీసీ'ఏ'లో చేర్చొద్దు



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) ముదిరాజ్ లను బీసీ "ఏ" లో చేర్చుద్దని రజక సంఘం నాయకులు రాందాస్ చౌరస్తాలో రాస్తారోకో చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఇటీవల ఒక్క సభలో రాష్ట్ర ముఖ్య మంత్రి సీఎం రేవంత్‌రెడ్డి ముదిరాజ్‌లను బీసీ 'ఏ'లో చేర్చే అంశంపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని ప్రకటించిన నేపథ్యంలో, సోమవారం రోజున జిల్లాకేంద్రంలో బీసీ ఏలో ఉన్నటి వంటి వివిద కులాలు జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో రాస్తారోకొ నిర్వహించారు. అనంతరం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి పత్రం అందించి కలెక్టరేట్ ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆర్థికంగా, రాజకీయంగా, అన్ని విధాలుగా ఎదిగిన ముదిరాజ్‌లను చేతి వృత్తేఆధారంగా, కడుపేద రికంలో మగ్గుతూ, సంచార జాతులు ఉన్నటు వంటి బీసీ 'ఏ'లో చేర్చే కుట్రను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఒక వేళ అదే జరిగితే బీసీ ఏ లోని నిరుపేదల నోటి కాడి ముద్దను లాకున్నట్లు అవుతుందని, ఈ విషయాన్ని అధికార పార్టీ పెద్దలు ఆలోచించాలని వారు ఆవేదన చెందారు. ఒక వేళ తమ డిమాండ్‌ను పరిగణలోకి తీసుకోక పోతే రాష్ట్ర వ్యాప్తంగా సహాయ నిరాకరణ చేస్తామని, రజకులు బట్టలు ఉతకటం, నాయిబ్రహ్మణులు క్షౌరాలు చేయటం, వడ్డెరులు రాళ్లు కొట్టడం మానేసి నిరాహారదీక్ష చేస్తామని హెచ్చరించారు. అంతే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ సభ్యులు సంగు స్వామి, చౌదరి మల్లేశం, పోతారాజు జనార్ధన్, చౌదరి నవీన్, బక్కవారి శివ,సంతోష్ లడ్డూ, లక్ష్మణ్, నాగరాజు, యాదగిరి, ఉపేంద్ర, గణేష్, మహేష్, వడ్డె సాయిలు, గంగిరెద్దుల మహేష్ తదితరులు పాల్గొన్నారు

# మహర్షి వాల్మీకి జీవితం సమాజానికి స్ఫూర్తిదాయకం

**- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) మహర్షి వాల్మీకి జీవితం, ఆదర్శాలు, ఆయన రచించిన రామాయణం సమాజానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ అన్నారు. మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన



జయంతి వేడుకల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి, మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహర్షి వాల్మీకి రచించిన రామాయణం మానవాళికి ధర్మం, సత్యం, న్యాయం, కర్తవ్యనిష్ఠ వంటి విలువలను బోధిస్తుందని పేర్కొన్నారు. ఆయన జీవితం మనిషిలో మార్పు సాధ్యమేనని, పట్టుదల, జ్ఞానం, నిరంతర కృషితో ఉన్నతమైన లక్ష్యాలను సాధించవచ్చని చాటిచెబుతుందన్నారు. మహర్షి వాల్మీకి బోధనలను ఆచరిస్తూ సమాజంలో సద్భావన, సమానత్వం, నైతిక విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ నగేష్ మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహర్షి వాల్మీకి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ వో అంబాదాస్ రాజేశ్వర్, బిసి సంక్షేమ శాఖ అధికారి ఉపేందర్, బిసి సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నాళ్ళు ఈ బానిసత్వం

**- ఈ నయా వెట్టిచాకిరికి ముగింపెన్నడు - 1000 మంది పార్ట్ టైం అసిస్టెంట్ ప్రొఫెసర్ల జీవితాలతో చెలగాటం**

**- సమాన పనికి సమాన వేతనం ఉట్టి మాటలేనా?**

తెలంగాణ రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాలు నేడు నడుస్తున్నాయంటే అందుకు ప్రధాన కారణం పార్ట్ టైం అసిస్టెంట్ ప్రొఫెసర్లు,కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు శ్రమ ఫలితమే అని చెప్పవచ్చు. ముఖ్యంగా దేశం అభివృద్ధి చెందాలంటే విద్య వ్యవస్థ అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. విశ్వవిద్యాలయాలు, విద్యా వ్యవస్థ అభివృద్ధి చెందకుండా ఏ వ్యవస్థ కూడా మనుగడ సాగించలేదు. యూనివర్సిటీలను బాగు చేయాల్సిన ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి. గత 30 సంవత్సరాలుగా పార్ట్ టైం అధ్యాపకులతో వెట్టిచాకిరి చేయించుకుంటూ వారి జీవితాలతో చలగాటమాడుతూ ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయి.

## 12 నెలల పని... ఆరునెలల జీతం..

పార్ట్ టైం అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఏళ్ల తరబడి విశ్వవిద్యాలయాలలో విధులు నిర్వహిస్తూ యూనివర్సిటీలు పురోగమనం వైపు తీసుకెళ్లడంలో తమ మేధస్సును దారపోస్తున్నారు. విద్యార్థులను ఉన్నత స్థాయిలో నిలబెడుతూ అతి తక్కువ వేతనాలతో అత్యున్నత సేవలందిస్తూ తమ జీవితాలను పణంగా పెడుతున్నారు. సంవత్సరం మొత్తం 12 నెలల సేవలందిస్తూ కేవలం 6 నెలలకు మాత్రమే వేతనాలు అందుకుంటూ నరకయాతన అనుభవిస్తున్నారు. యూనివర్సిటీల అభివృద్ధిలో ముందుంటూ వెట్టి చాకిరి చేస్తూ తమ జీవితాలను త్యాగం చేస్తున్నారు.

## 1992 నుంచి పార్ట్ టైం వ్యవస్థ ప్రారంభం..

యూనివర్సిటీలలో పదవీ విరమణ చేసిన ప్రొఫెసర్ల స్థానంలో త్వరితగతిన విద్యను అందించేందుకు అర్హులైన విద్యావంతులతో ఆయా విభాగాల అధిపతులు పార్ట్ టైం అధ్యాపకుల పేరుతో పూర్తిస్థాయి విద్యా సంవత్సరానికి నియామకాలు చేపట్టే వ్యవస్థను 1992 నుంచి ప్రారంభించారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు పార్ట్ టైం అధ్యాపకులు యూనివర్సిటీల అభివృద్ధిలో వెన్నెముకగా నిలుస్తున్నారు. ఒక్కో పిరియడు(గంటకు) రూ. 40 చొప్పున గౌరవ వేతనం ఇచ్చే సంప్రదాయాన్ని మొదలుపెట్టారు. అదే క్రమంలో ఒక్క వారానికి యూజీసీ నిబంధనల ప్రకారం 16 పీరియడ్లు (గంటలు) వర్కులోడు ఉంటే పార్ట్ టైం నుంచి కాంట్రాక్టు అధ్యాపకులుగా అప్గ్రేడ్ చేసిన విధానం ఉంది. ఈ రకమైన సాంప్రదాయం 2014 జూన్ 2 వరకు కొనసాగింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో అప్ గ్రేడ్ ను ప్రభుత్వం ఆపివేసి పార్ట్ టైం అధ్యాపకుల జీవితాలను ప్రశ్నార్థకంలో పడేసింది.

## సైన్స్ సబ్జెక్టులు బోధించే అధ్యాపకులకు తీవ్ర అన్యాయం..

పార్ట్ టైం అధ్యాపకుల గౌరవ వేతనం గంటకు రూ. 40 నుంచి రూ. 60, రూ .120, రూ. 320 వరకు చాలా సంవత్సరాలు పాటు కొనసాగింది. అనేక ఉద్యమాల ఫలితంగా ప్రస్తుతం గంటకు థియరీ బోధిస్తే రూ. 700 , ప్రాక్టికల్ క్లాసు తీసుకుంటే కేవలం రూ. 350 మాత్రమే చెల్లిస్తున్నారు. ఇలా వేతనాలలో థియరీ, ప్రాక్టికల్ కు వ్యత్యాసం ఉండటంతో సైన్స్ అధ్యాపకులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. నెలసరి వేతనం కేవలం రూ. 15,000 మించడం లేదు. ఇలాంటి పద్ధతి పార్ట్ టైమ్ వాళ్లకు శాపంగా మారింది.

## నీరు గారిపోయిన సమాన పనికి సమాన వేతనం నినాదం..

దేశ అత్యున్నత న్యాయస్థానం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న తీర్పును ప్రభుత్వాలు, యూనివర్సిటీలు ఎప్పుడో పక్కనపెట్టాయి. యూనివర్సిటీలలో బోధించే అధ్యాపకుల అర్హతలు సమానం, పనిగంటలు సమానం, బోధించే యుజి, పీజీ క్లాసులు సమానంగా బోధిస్తారు. కానీ పర్మినెంట్ అధ్యాపకుల నెలసరి వేతనం, పార్ట్ టైం అధ్యాపకుల పొందే సంవత్సర వేతనం కూడా సమానంగా ఉండదు. ఇలాంటి అన్యాయం ఉన్నత విద్యాసంస్థల్లో ఉంది. అస్థిరమైన జీతంతో అతి తక్కువ వేతనాలతో జీవితాలను గడుపుతూ ఇంకా బానిసత్వంలోనే మగ్గుతున్నారు అధ్యాపకులు.

## ఉత్తమ సేవలు- ఉన్నత స్థాయిలో యూనివర్సిటీలు..

ప్రస్తుతం రాష్ట్రంలోని యూనివర్సిటీలలో 13 సంవత్సరాలుగా రెగ్యులర్ నియామకాలు లేకపోవడంతో అన్ని యూనివర్సిటీలు, విద్యాసంస్థల్లో కేవలం పార్ట్ టైం అధ్యాపకులై 80 శాతానికి పైగా సేవలందిస్తున్నారు. ప్రతి యూనివర్శిటీకి అనుబంధ కళాశాలలకు యూజీ మరియు నాక్ గుర్తింపులు వస్తున్నాయి. అంటే అందుకు ప్రధాన కారణం పార్ట్ టైం అధ్యాపకులే. కేవలం 80 శాతానికి పైగా పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకులు ఉన్నతమైన అర్హతలు కలిగి, పరిశోధన అనుభవాలనుతో యూనివర్సిటీలు జాతీయ మరియు అంతర్జాతీయ గుర్తింపు పొందుతూ ఉన్నాయనటంలో అతిశయోక్తి లేదు. నాక్, యుజిసిలతో పాటు వివిధ జాతీయ సంస్థలకు ఇచ్చే వార్షిక నివేదికలలో పార్ట్ టైం అధ్యాపకుల వివరాలు రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా పంపుతూ వేతనాలు వివిధ సమస్యల పరిష్కరించడంలో యూనివర్సిటీలు తీవ్ర వివక్షత చూపుతూ వెట్టిచాకిరీలు చేయించుకుంటున్నాయి. పార్ట్ టైం అధ్యాపకుల భవిష్యత్తును అంధకారంలోకి నేడుతూ విశ్వవిద్యాలయాలు తమ అవసరాలను తీర్చుకుంటున్నాయి.

## అత్యంత దయనీయంగా అధ్యాపకుల జీవితాలు..

12 నెలలు పనిచేస్తూ కేవలం ఆరు నెలలకు మాత్రమే వేతనాలు పొందుతూ అతి కష్టంగా కుటుంబాలను కడుపేదరికంతో వెలదీస్తున్నారు పార్ట్ టైం అధ్యాపకులు. ఒకవైపు 50 ఏళ్లు దగ్గరవుతున్న మరోపక్క వీళ్ల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వాలు లేకపోవడంతో వీరు అయోమయానికి గురవుతున్నారు. తమ భవిష్యత్తు అంధకారమైన పేద పిల్లలకు అన్యాయము జరగకూడదని ఉద్దేశంతో తమ బోధనను కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని అనేక సంవత్సరాలుగా ఉద్యమిస్తున్నారు.

## హామీలు కాదు.. ఆచరణ ముఖ్యం..

ప్రస్తుత ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోలో 12 నెలలతో కూడిన వేతనం ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఆ హామీలను నెరవేర్చి వీరిని ఆదుకోవాలని అధ్యాపకులు డిమాండ్ చేస్తున్నారు. అధ్యాపకుల డిమాండ్లను పరిష్కరించాలని, వారి ఉద్యమాలకు స్పందించాలని ప్రభుత్వాన్ని యూనివర్సిటీ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పార్ట్ టైం అధ్యాపకులు సమస్యలు పరిష్కరించాలన్న విద్య కమిషన్ నివేదిక..

తెలంగాణ రాష్ట్ర విద్య కమిషన్ రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలలో పర్యటించి అధ్యాపకుల సమస్యలను అధ్యయనం చేసింది. తెలంగాణ విద్య కమిషన్ చైర్మన్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, డాక్టర్ చారగొండ వెంకటేష్



డాక్టర్ జీవన్ పాలడుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ (పీటీ)(నిజాం కాలేజీ ఉస్మానియా యూనివర్సిటీ హైదరాబాద్

ఆధ్వర్యంలో కమిషన్ పార్ట్ టైం అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేసింది. వీరి సేవలు గుర్తించిన వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలోనూ కమిషన్ సూచించింది.

## సమస్యలు పరిష్కరించాకే నోటిఫికేషన్ వేయాలి..

రాష్ట్రంలో పార్ట్ టైం అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాకే ప్రొఫెసర్ నియామకాల కోసం నోటిఫికేషన్ విడుదల చేయాలనే ప్రధానమైన డిమాండు ముందుకు వచ్చింది. సమాన పనికి సమాన వేతనం, బోధన సర్వీసుకు నియమకాల్లో తగిన గుర్తింపు, కన్సాలిడేటెడ్ వేతనం ఇచ్చి వీరిని ఆదుకొని వీళ్ళ సేవలకు గుర్తింపు ఇవ్వాల్సిన అవసరం ఉంది. అప్పుడే వీరి సేవలకు తగిన గుర్తింపు, గౌరవం, న్యాయం దక్కుతుంది.

## ప్రతి అవకాశాన్ని సమస్యల పరిష్కారానికి అనుకూలంగా మార్చుకోవాలి..

ప్రస్తుతం రాష్ట్రంలో రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ ఎన్నికల్లో అన్ని యూనివర్సిటీలలో దాదాపు 1000 మందికి పైగా ఉన్న పార్ట్ టైం అధ్యాపకులు ఏకతాటిపైకి నిలబడి తమ ఓటును ఆయుధంగా మార్చుకొని తమ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. అధ్యాపకుల సమస్యలపరిష్కారానికి ప్రణాళికలు తయారు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఆమోదయోగ్యమైన ఓటు ఉద్యమం ద్వారా సమస్యల పరిష్కార దిశగా ఆలోచించి బలమైన ఉద్యమం నిర్మించాలి. అప్పుడే సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.

# కులాంతర వివాహ ప్రోత్సాహక ఫిక్స్ బాండ్ అందజేత

**- 16 మందికి రూ.2,50,000 చొప్పున బాండ్లను పంపిణీ చేసిన కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**సిరిసిల్ల(ప్రశ్న న్యూస్)** ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా మంజూరైన కులాంతర వివాహ ప్రోత్సాహక ఫిక్స్ బాండ్లను కలెక్టర్ గరిమ అగ్రవాల్ అందజేశారు. జిల్లాలోని ఆయా మండలాలకు చెందిన 16 మంది కులాంతర వివాహం చేసుకోగా, ప్రభుత్వ ప్రోత్సాహక కోసం ఎస్సీ సంక్షేమ శాఖకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సీ సంక్షేమ శాఖ నుంచి ఒక్కో జంటకు మంజూరు అయిన రూ. 2,50,000 విలువైన ఫిక్స్ బాండ్లను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం లబ్ధిదారులకు కలెక్టర్ గరిమ అగ్రవాల్ అందజేశారు. కార్యక్రమంలో ఇంచార్జి జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ద్వారకామాయి ఎన్‌క్లేవ్‌కు మహర్దశ వచ్చేనా.?

**- మౌలిక సదుపాయాలపై ఎమ్మెల్యేకు కాలనీ వాసుల వినతి.. సమస్యల పరిష్కారంపై ఆశలు**



**కీసర ( ప్రశ్న న్యూస్)** కీసర సర్కిల్ పరిధిలోని చీర్యాల గ్రామానికి చెందిన ద్వారకామాయి ఎన్‌క్లేవ్‌లో నెలకొన్న పలు పౌర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ నివాసితుల ప్రతినిధి బృందం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించింది. కాలనీలో చాలాకాలంగా నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా కాలనీలో మురుగునీటి పారుదల వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, తాగునీటి సరఫరాలో ఇబ్బందులు, విద్యుత్ సరఫరాలో తరచూ హెచ్చుతగ్గులు వంటి సమస్యలను ప్రతినిధి బృందం ఎమ్మెల్యేకు వివరించింది. ఈ సమస్యలతో నివాసితులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలియజేస్తూ, సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి శాశ్వత పరిష్కారం చూపించాలని కోరింది.

## సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే హామీ

కాలనీ ప్రతినిధులు వివరించిన సమస్యలపై ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సానుకూలంగా స్పందించారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని, కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కార ప్రక్రియను పర్యవేక్షిస్తూ, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకునే బాధ్యతను బీఆర్ఎస్ స్థానిక నాయకుడు కందాడి శ్రీకాంత్ రెడ్డికి అప్పగించారు.

## ఎమ్మెల్యేకు కాలనీ వాసుల కృతజ్ఞతలు

తమ సమస్యలను విని, వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మల్లారెడ్డికి ద్వారకామాయి ఎన్‌క్లేవ్ నివాసితులు, కాలనీ కమిటీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు త్వరితగతిన స్పందించి, కాలనీలో నెలకొన్న పౌర సమస్యలను పరిష్కరించాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఘనంగా మందముల పరమేశ్వర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు



**నాచారం (ప్రశ్న న్యూస్)** నిఖిల్ సాయి ఆధ్వర్యంలో మందముల పరమేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుల సమక్షంలో సంప్రదాయబద్ధంగా గోవు దానం కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి క్షణం ప్రజల కోసం తపించే నాయకుడు మందముల పరమేశ్వర్ రెడ్డి అని నిఖిల్ సాయి కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొని పరమేశ్వర్ రెడ్డికి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు.

# ప్రజావాణికి 55 ఫిర్యాదులు




శేర్లింగంపల్లి(ప్రశ్న న్యూస్) సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 55 ఫిర్యాదులు అందాయి. వీటిలో అత్యధికంగా టౌన్‌ప్లానింగ్ విభాగానికి 42 ఫిర్యాదులు వచ్చాయి. ఇంజినీరింగ్ విభాగానికి 5, రెవెన్యూ (ఆస్తిపన్ను), పారిశుధ్య విభాగాలకు రెండేసి, వెటర్నరీ, భూసేకరణ, అర్బన్ బయోడైవర్సిటీ, అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ విభాగాలకు ఒక్కో ఫిర్యాదు అందింది. ఫిర్యాదులన్నింటినీ ప్రత్యేక గుర్తింపు సంఖ్యలతో నమోదు చేసి, వాటి పరిష్కార పురోగతిని తెలుసుకునేందుకు ట్రాకింగ్ లింకులను అందుబాటులో ఉంచారు. ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను అధికారులు ఆదేశించారు.

# ప్రభుత్వ పెట్రోల్ బంక్‌ను ప్రారంభించిన కలెక్టర్ బి. సత్య ప్రసాద్



**జగిత్యాల(ప్రశ్న న్యూస్)** జగిత్యాల పట్టణంలోని తహసీల్దార్ ఆఫీస్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన జగిత్యాల కలెక్టరేట్ ప్రభుత్వ పెట్రోల్ బంక్ ను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ సోమవారం ప్రారంభించారు. ఐ.డి ఓ.సి. ఆధ్వర్యంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారి సహకారంతో ఈ



పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేశారు. పట్టణంలోని తహసీల్దార్ ఆఫీస్ చౌరస్తాకు వచ్చే ప్రజలు, అధికారులు, ఉద్యోగులు, వాహనదారులకు ఇంధనాన్ని సులభంగా అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా దీనిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పెట్రోల్ బంక్‌లో నాణ్యత ప్రమాణాలు, సరైన కొలతలు, భద్రతా చర్యలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన సేవలు అందించాలని, పెట్రోల్ బంక్ నిర్వహణలో పారదర్శకత పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన ఇంధనాన్ని అందించడంతో పాటు, వాహనదారులకు సౌకర్యవంతంగా సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా రెవెన్యూ అధికారి కె వై ప్రసాద్ (డీఆర్ఓ), ఆర్డీఓ మధుసూదన్, కలెక్టరేట్ ఏఓ కిషన్, జిల్లా పౌరసరఫరాల శాఖకు సంబంధించిన అధికారులు, పెట్రోల్ బంక్‌కు సంబంధించిన అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వాల్మీకి జయంతి సందర్భంగా అయ్యప్ప స్వాములకు అన్నదానం

- రాములవారి ఆలయం వద్ద భక్తిశ్రద్ధలతో భిక్ష ప్రసాద వితరణ
- తలుపుల కోటేశ్వరరావు, నాగేశ్వరరావు తదితరుల ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమం







**వల్లూరుపాలెం (ప్రశ్న న్యూస్)** వాల్మీకి జయంతిని పురస్కరించుకుని వల్లూరుపాలెం గ్రామంలోని రాములవారి దేవాలయం వద్ద అయ్యప్ప స్వాములకు భిక్ష ప్రసాదం అందించే కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తోట్లవల్లూరు మండలం, పామర్రు నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములకు భిక్ష ప్రసాదం అందించి భక్తిని, సేవాభావాన్ని చాటుకున్నారు. తలుపుల కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, కృష్ణ, తారకం, ధర్మేందర్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి జయంతి సందర్భంగా ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ సేవా కార్యక్రమం భక్తులలో ఆనందాన్ని నింపింది. భక్తులకు అన్నదానం చేయడం పవిత్రమైన సేవగా భావిస్తూ, అయ్యప్ప స్వాములకు భిక్ష ప్రసాదం అందించడం ద్వారా నిర్వాహకులు తమ భక్తిభావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ భిక్ష ప్రసాద వితరణ కార్యక్రమం గ్రామంలో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

## మంత్రి శ్రీధర్ బాబు ఇలాకాలో

# ఎంఈఓ కుర్చీ ఖాళీ?

- ప్రైవేటు పాఠశాలలకు ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు.
- ఎంఈఓ ఎవరి ఫోన్లు లిఫ్ట్ చేయుటం లేదు.
- మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్ తీరుపై పలు విమర్శలు.
- కలెక్టర్ డీఈవో దీనిపై దృష్టి సాధించాలని విజ్ఞప్తి.
- ఎంఈఓ అందుబాటులో ఉంటలేదని పలు విమర్శలు.









**మంథని (ప్రశ్న న్యూస్)** మంథని నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాల్సిన మండల విద్యాశాఖ అధికారి ఎంఈఓ ప్రైవేట్ పాఠశాలలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికంగా పలువురు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, విద్యార్థుల నమోదు, విద్యా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన సమయంలో, ప్రైవేట్ విద్యాసంస్థలకే ఎక్కువ ప్రోత్సాహం ఇస్తున్నట్లు అభిప్రాయపడుతున్నారు ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం చేపట్టాల్సిన పర్యవేక్షణ, విద్యార్థుల నమోదు పెంపు, సమస్యల పరిష్కారంపై తగిన శ్రద్ధ కనిపించడం లేదని విమర్శలు గతంలో ఒక ప్రైవేటు పాఠశాల నడిరోడ్డు మీద ధర్నా చేస్తే గంటల తరబడి ఉన్న ఎంఈఓ అక్కడికి వచ్చిన దాఖలాలు కనిపించలేదు కొందరు విద్యార్థులు సొమ్మసిల్లి పడిపోయినారు అయినప్పటికీ ఎంఈఓ కు బాధ్యత లేదా అని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు ఫోన్ చేస్తే స్పందించదు తర్వాత రిప్లై ఉండదు ఎంఈఓ అంటే ప్రతి గవర్నమెంటు స్కూల్లో పర్యవేక్షించాలి కానీ ఆమె అందుబాటులో లేకుండా పాఠశాలలలే పట్టించుకోకుండా ఎంఈఓ ఆఫీసు కూడా చుట్టపు చూపుగా వచ్చి వెళుతుంది అనే పలు విమర్శలు వెళ్ళు వెతుకుతున్నాయి. ఈ నేపథ్యంలో మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్. వ్యవహారశైలిపై జిల్లా కలెక్టర్ విద్యాశాఖ డీఈ వో, పై అధికారులు స్థానికంగా ఎంఈఓ ఉండాలని ఆదేశాలు ఉన్నప్పటికీ వారి మాటను పేడచెవిన పెట్టి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ఎంఈఓపై దృష్టి సారించి వాస్తవ పరిస్థితులపై విచారణ జరపాలని పలువురు ప్రజా సంఘాల నాయకులు విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు కోరుతున్నారు.

# సిరిసిల్లలో అంగరంగ వైభవంగా రథోత్సవం



సిరిసిల్ల(ప్రశ్న న్యూస్) జిల్లా కేంద్రంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం నిర్వహించిన స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకలకు వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. స్వామివారి రథోత్సవం పుర వీధుల గుండా సాగుతుండగా భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి రథోత్సవంలో పాల్గొనడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని భక్తులు తెలిపారు. భక్తుల కోసం స్వామివారు రథంపై ఊరేగింపుగా వస్తున్నారనే విశ్వాసం, భక్తుల ముఖాల్లో కనిపించే ఆనందం, ఆధ్యాత్మిక భావన మన ధర్మం గొప్పతనాన్ని చాటి చెప్తుందన్నారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను కాపాడుకుంటూ భక్తిభావంతో ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి. కలియుగ దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామిని ఆరాధించడం మన సంస్కృతి, సంప్రదాయాల్లో విశిష్టమైన భాగమని భక్తులు తెలిపారు. ప్రతి సంవత్సరం నిర్వహించే బ్రహ్మోత్సవాలు, పూజలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు లోక కల్యాణాన్ని ఆకాంక్షిస్తూ నిర్వహించేవని పూజార్లు తెలిపారు. వేద పండితుల ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుకలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందిస్తాయని అన్నారు.

ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు పుష్కలంగా పండాలని, రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రకృతి విపత్తులు, ప్రతికూల పరిస్థితులు తొలగిపోయి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని స్వామివారి ఆశీస్సులు అందరికీ లభించాలని ఆకాంక్షించారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రాచీన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం వంటి పుణ్యక్షేత్రాలు ఈ ప్రాంత ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకలని అన్నారు. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు విజయవంతంగా జరగడం సంతోషకరమని, స్వామివారి కృపతో ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం, సుఖసంతోషాలు ప్రాప్తిస్తాయని విశ్వాసం.



Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588